RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -280 పేజీలు - 08 వెల - 04/- మంగళవారం19 ఆగస్టు 2025




# తాడిపత్రిలో తీవ్ర ఉద్రిక్తత..

**భారీగా పోలీసు బలగాల మోహరింపు**

**దమ్ముంటే రా.. తేల్చుకుందాం!: పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డి బహిరంగ సవాల్**

**హైకోర్టు అనుమతితో తాడిపత్రిలో అడుగుపెట్టనున్న కేతిరెడ్డి**

# అమరావతికి కొత్త రూపు...

## సీఆర్డీఏ సమావేశంలో 9 ప్రతిపాదనలకు ఆమోదముద్ర

**సీఆర్డీఏ సమావేశంలో చంద్రబాబు సర్కార్ కీలక అడుగులు**

**రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులకు రూ.904 కోట్ల కేటాయింపు**

**మంగళగిరిలో గోల్డ్ క్లస్టర్ ఏర్పాటుకు భూ సమీకరణకు ఆమోదం**

**అమరావతిలోని కీలక ప్రాజెక్టుల కోసం ప్రత్యేక ఎస్పీవీల ఏర్పాటు**

**విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు అదనంగా చెరొక 100 ఎకరాలు**

అమరావతి,**ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి :**
రాజధాని అమరావతిని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై నిర్మించే ఐకానిక్ వంతెనకు అద్భుతమైన డిజైన్ ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంప్రదాయ కూచిపూడి నృత్య భంగిమ సహా వేర్వేరు నూతన డిజైన్లను పరిశీలించాలని సూచించారు. సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 51వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం 9 ప్రతిపాదనలకు ఆమోదం తెలియచేసింది. మిగతాది 2లో...



# కొత్త బార్ లైసెన్స్ విధానాలు ఖరారు

**రెస్టారెంట్ ఉండాలనే నిబంధన సడలింపు**



అమరావతి,**ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి ::**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కొత్త బార్ పాలసీ నిర్ణయం తీసుకుందని ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. 840 బార్లు ఏపీ వ్యాప్తంగా ఉన్నాయని.. పదిశాతం కల్లు గీత కులస్థులకు కేటాయిస్తామని పేర్కొన్నారు.



# జనజీవనం అస్తవ్యస్తం

## తెలంగాణ జిల్లాల్లో వర్షబీభత్సంతో నీట మునిగిన పంట పొలాలు

**లోతట్టు ప్రాంతాలు జలమయం**

హైదరాబాద్ **ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి :**
రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు ప్రాంతా లను వరదలు ముంచ టత్తుతున్నాయి. ఏజెన్సీ ప్రజలు అల్లాడుతు న్నారు. వాగులు వంకలు పొంగిపొ ర్లుతున్నాయి. ప్రాజెక్టుల గేట్లు తెరవడంతో కాలువల కట్టలు తెగి పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయాయి. మిగతాది 2లో...




# దేశంలో ఓట్ల దొంగలు

**తెలంగాణలోనూ ఓట్ల చోరీకి కుట్రలుకలిసికట్టుగా వారి భరతం పట్టాలి**

**బహుజనుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం -బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది కిషన్‌రెడ్డి, మోడీనే..**

**: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

# చేయూతనివ్వండి

**ఢిల్లీలో బిజీగా మంత్రి నారా లోకేశ్..**

**కేంద్రమంత్రులతో వరుస భేటీలు**

**-ఆంధ్రప్రదేశ్‌లో డేటా సిటీ ఏర్పాటుకు వినతి**

**-విఇధ రోడ్డు ప్రాజెక్టులపై నితిన్ గడ్కరీతో చర్చలు**

న్యూఢిల్లీ,**ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి :**
ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ మంత్రి నారా లోకేశ్.. పలువురు కేంద్ర మంత్రులతో భేటీ- అయ్యారు. విదేశాంగమంత్రి జైశంకర్, జేపీ నడ్డా, హర్దీప్‌సింగ్ పురీ, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో డేటా సిటీ ఏర్పాటుకు సహకారం అందించాలని జైశంకర్‌ను కోరారు. మిగతాది 2లో...









# వాయు గండం

**బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం**

**పలు జిల్లాల్లో జోరుగా కురుస్తున్న వర్షాలు**

**చెరువులను తలపిస్తున్న రహదారులు**

**-రైళ్ల రాకపోకులు క్రమబద్ధీకరణ**

## అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు

**భారీ వర్షాల నేపథ్యంలో సీఎస్ విజయానంద్‌తో సీఎంసమీక్ష**

**అల్పపీడనం వాయుగుండంగా మారనుందన్న వాతావరణ శాఖ హెచ్చరిక**

**ఉత్తరాంధ్రలో తాజా పరిస్థితిపై ముఖ్యమంత్రికి సీఎస్ వివరణ**

**అన్ని జిల్లాల కలెక్టర్లను వెంటనే అప్రమత్తం చేయాలని ఆదేశం**

**అవసరమైతే విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాలని సూచన**

**జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని స్పష్టం**

విశాఖపట్నం,**ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి ::-**బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేస్తోంది.. ఇక, వాయుగుండం ఎఫెక్ట్‌తో ఉత్తరాంధ్రవ్యాప్తంగా కుండపోత వర్షం కురుస్తోంది.. ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.. మిగతాది 2లో...

# ఉక్రెయిన్ సమస్యకు శాంతియుత పరిష్కారమే మార్గం

**మోదీకి ఫోన్ చేసిన పుతిన్..**

**ట్రంప్‌తో చర్చల వివరాలు వెల్లడి**

**పుతిన్-ట్రంప్ చర్చలను స్వాగతించిన భారత విదేశాంగ శాఖ**

**ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపైనా చర్చ**

**ఆగస్టు 21న మాస్కోకు భారత విదేశాంగ మంత్రి జైశంకర్**

2లో.



# సీఈసీని తొలగించాలి

**ఎలక్షన్ కమిషనర్ పై ఇండియా కూటమి కీలక నిర్ణయం!**

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలంటూ పార్లమెంట్ లో కూటమి తీర్మానం!**

**ఓట్ చోరీ ఆరోపణలతో ముదిరిన వివాదం**

**రాహుల్ గాంధీకి వారం రోజుల అల్టిమేటం జారీ చేసిన సీఈసీ**

న్యూఢిల్లీ**ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి :**
ఎలక్షన్ కమిషన్, ఇండియా కూటమి మధ్య వివాదం ముదురుతోంది. రాహుల్ గాంధీకి వారం రోజులు గడువుతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అల్టిమేటం జారీ చేయడంపై ఇండియా కూటమి నేతలు భగ్గుమంటున్నారు. ఈ నేపథ్యంలో సీఈసీని తొలగించాలని పార్లమెంట్ లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు కూటమి నేతలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సీఈసీని పదవిలో నుంచి తొలగించాలంటే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించే పద్ధతే పాటించాల్సి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. మిగతాది 2లో...



# నరేంద్ర మోదీతో శుభాంశు భేటీ...

**ప్రధానికి వ్యోమగామి అపురూప కానుక**

**అంతరిక్షంలోకి తీసుకెళ్లిన జాతీయ జెండాను ప్రధానికి బహూకరణ**

**తన యాత్ర అనుభవాలను, ప్రయోగాల వివరాలను పంచుకున్న శుక్లా**

**వ్యోమగామిని అభినందించిన ప్రధాని మోదీ**



# వాయు గండం

(మొదటి పేజి తరువాయి)

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాలు నీటమునిగి నష్టపోయామని రైతులు వాపోతున్నారు. విజయనగరం జిల్లాలో ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో అధిక వర్షపాతం నమోదైంది. వంగర, మెరకముడిదాం, దత్తిరాజేరు, గజపతినగరం, గుర్ల మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా.. బాడంగి, వేపాడ, లక్కవరపు కోట, కొత్తవలస, పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. భోగాపురం విమానాశ్రయ నిర్మిత ప్రాంతంలోని లోతట్టు– ప్రాంతాల నుంచి వర్షపునీరు రావడంతో తూడెం, చినకౌలువాడ, పెదకౌలువాడ, బైరెడ్డిపాలెం వాసులు ఇబ్బందులు పడుతున్నారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. విశాఖ ఫిషింగ్ హార్బర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఓడరేవు ప్రాంతమంతా వర్షం నీరు నిండి.. చేపల వ్యాపారులు, మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి, అనంతవరం, తదితర ప్రాంతాల్లో వర్షాలకు వరినాట్లు– నీట మునిగాయి. రెండు వారాల క్రితమే నాట్లు– వేశామని రైతులు చెబుతున్నారు. పొలాల పైనుంచి వర్షం నీరు ప్రవహిస్తోంది. మరికొందరు నాట్లు– వేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోనూ వర్షం విస్తారంగా కురుస్తోంది. తొండంగి మండలంలో అత్యధికంగా 55.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గొల్లప్రోలు మండలంలోని సుద్దగడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు–చేసుకోగా.. అది నీట మునగడంతో కొత్త వంతెనపై ప్రజలు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. గొల్లప్రోలు మండలంలో దాదాపు 1000 ఎకరాలు ముంపునకు గురైంది. గడచిన 24 గంటల్లో విశాఖలోని కాపులుప్పాడలో 15.3 సెంటీ–మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది.. విశాఖ, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది వాతావరణశాఖ.. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, కృష్ణ, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాలకు ఆరంజ్ ఎలెర్ట్ జారీ అయ్యింది.. నేడు పలు ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షపాతం నమోదయ్య అవకాశం ఉండగా.. తీరం వెంబడి ఈదురు గాలుల ప్రభావం కొనసాగుతోం.. కోస్తా తీరం వెంబడి పోర్టులకు మూడవ నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టం చేశారు.. వాయుగుండం ఎఫెక్ట్‌తో అప్రమత్తమైన తూర్పు కోస్తా రైల్వే శాఖ.. కేకే లైన్‌లో పలు రైళ్లు దారి మళ్లించింది.. మరికొన్ని రైళ్లు రద్దు చేసినట్టు ప్రకటించారు.. మరోవైపు, అరకు పర్యాటక రైలు ఇవాళ, రేపు రద్దు చేసినట్టు– అధికారులు ప్రకటించారు.. ఇక, దారిమళ్లిన రైళ్లను పరిశీలిస్తే.. 18515 విశాఖ – కిరండోల్ నైట్ ఎక్స్ ప్రెస్ ను దారిమళ్లించారు.. ఇప్పటికే అరకు చేరుకున్న 58501 విశాఖ – కిరండోల్ రైలును వెనక్కి రప్పిస్తున్నారు అధికారులు.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న కుండపోత వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో సోమవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. విజయానంద్‌తో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నెలకొన్న తాజా పరిస్థితులను సీఎస్ ముఖ్యమంత్రికి వివరించారు.



పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లను తక్షణమే అప్రమత్తం చేయాలని సీఎస్‌ను ఆదేశించారు. భారీ వర్షాల వల్ల ఎదురయ్యే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. "ప్రజలకు సమాచారం అందించేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో వెంటనే ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి అన్నారు. వర్షాల తీవ్రత పెరిగితే విద్యార్థుల భద్రత దృష్ట్యా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే విషయాన్ని పరిశీలించాలని కూడా ఆయన సూచించారు. ముందస్తు సన్నద్ధత, అప్రమత్తతే మనల్ని కాపాడతాయని, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వండి

(మొదటి పేజి తరువాయి)

ఇటీవల ఏపీ బృందం సింగపూర్ పర్యటన వివరాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం సింగపూర్ ప్రభుత్వంతో జరిపిన చర్చల గురించి కేంద్ర మంత్రికి నారా లోకేశ్ వివరించారు. జేపీ నడ్డాతో సమావేశమైన రాష్ట్రంలో యూరియా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 21 నాటికి సమస్యను పరిష్కరిస్తామని ఆయనకు నడ్డా హామీ ఇచ్చారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీని కూడా మంత్రి లోకేశ్ కలిశారు. బీపీసీఎల్ రిఫైనరీ త్వరితగతిన నిర్మించేందుకు సహకారం అందించాలని కోరారు. ఓఎన్‌జీసీకి చెందిన జాక్ అఫ్ రిగ్ కాంట్రాక్టు సాధనకు సహకరించాలని కోరారు. ఏపీలో దీపం–2 పథకానికి మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. నిర్మలా సీతారామన్‌ను ఆయన కలిశారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన లోకేశ్.. ఆర్థిక ఇబ్బందుల నుంచి రాష్ట్రం గట్టెక్కేందుకు సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రమంలో కేంద్ర ఉపరితల రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో నారా లోకేష్ భేటీ అయ్యారు. పలు కీలక అంశాలపై చర్చించారు. విజయవాడ బెంజి సర్కిల్ వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా కానూరు – మచిలీపట్నం నడుమ ఆరులైన్ల రోడ్డు విస్తరణకు వెంటనే ఉత్తర్వులు జారీచేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను మీడియాకు మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన కానూరు – మచిలీపట్నం రోడ్డు విస్తరణ ద్వారా విజయవాడలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంతోపాటు– రాజధాని ప్రాంత



అభివృద్ధికి కూడా ఉపకరిస్తుందని తెలిపారు. హైదరాబాద్ – అమరావతి మధ్య కనెక్టివిటీలో ఎన్ హెచ్ 65 కీలక పాత్ర పోషిస్తుందని ఉద్ఘాటించారు. ఇప్పటికే మంజూరైన హైదరాబాద్ – గొల్లపూడి రహదారి విస్తరణ ప్రాజెక్టును అమరావతితో అనుసంధానించేలా అదనపు పోర్టు లింకేజిని డీపీఆర్‌లో చేర్చాలని సూచించారు. విజయవాడ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి తూర్పు బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. ఎన్‌హెచ్ – 16 వెంట విశాఖపట్నంలో 20 కిలోమీటర్లు, విజయవాడలో 14.7 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ÷–లపై ఓవర్ ఫ్లస్ మెట్రో కారిడార్లను నాగపూర్ మోడల్‌లో అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైందని వివరించారు. ఇందుకు సంబంధించి ఎన్ హెచ్ఎఐ, ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఉమ్మడి భాగస్వామ్యంతో డీపీఆర్ రూపకల్పన, వ్యయాన్ని భరించే అంశంపై చర్చ జరిగిందని చెప్పుకొచ్చారు. ఏపీలో రీజనల్ కనెక్టివిటీ–, డెవలప్‌మెంట్ కారిడార్ల అభివృద్ధిలో భాగంగా కర్నూలు – ఎమ్మిగనూరు రహదారి విస్తరణ, బైపాస్ రోడ్డు నిర్మాణం, వినుకొండ–గుంటూరు నడుమ ఎన్‌హెచ్ 544డీ,



కాకినాడ పోర్టు – ఎన్‌హెచ్ 216 నడుమ దక్షిణ రహదారి, కాణిపాక వినాయక దేవాలయం లింకు రోడ్డు నిర్మాణ పనుల చేపట్టాల్సిందిగా కోరారు. బెంగుళూరు – చెన్నయ్ రహదారికి డైరక్ట్ కనెక్టివిటీ– కోసం కుప్పం–హోసూరు – బెంగుళూరు నడుమ 56 కిలోమీటర్ల మేర రూ.3వేల కోట్లతో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి వేగంగా అనుమతులు మంజూరు చేయాలని లోకేష్ కేంద్రమంత్రికి విన్నవించారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ–(కాడా) ప్రాంతంలో పారిశ్రామిక పార్కు అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు భద్రతా ప్రమాణాల మెరుగుదల, ట్రాఫిక్ రద్దీ నిర్వహణ, లాజిస్టిక్స్, పాసింజర్ కారిడార్ల ఇంటిగ్రేషన్ ఆవశ్యకతను వివరించారు. కేందప్రభుత్వ సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతమైన భూసేకరణకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. స్థిరమైన మోడరన్ కనెక్టివిటీ– కోసం గ్రీన్ కారిడార్లు, అధునాతన టోలింగ్, రియల్ –టైమ్ ట్రాఫిక్ సమాచార వ్యవస్థల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం వహించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

# అమరావతికి కొత్త రూపు...

(మొదటి పేజి తరువాయి)

రాజధాని అమరావతిలో చేపట్టే వివిధ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు ప్రత్యేక వాహక సంస్థ ఏర్పాటుకు సీఆర్డీఏ అథారిటీ తన ఆమోదాన్ని తెలియచేసింది. రాజధానిలో చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు, ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు, స్పోర్ట్స్ సిటీ , స్మార్ట్ ఇండస్ట్రీస్, రివర్ ఫ్రంట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, రోప్ వే లాంటి ప్రాజెక్టులకు ఎస్పీవీ ఏర్పాటు చేసేందుకు అంగీకారాన్ని తెలిపింది. మంగళగిరిలో గోల్డ్ క్లస్టర్ లో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు ఏర్పాటుకు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూ సమీకరణ చేసేందుకు కూడా అథారిటీ ఆమోదించింది. మంగళగిరిలోని ఆత్మకూరు వద్ద 78 ఎకరాల్లో గోల్డ్ క్లస్టర్ ను ఏర్పాటు చేసేందుకు భూ సమీకరణ చేయాలన్న సీఆర్డీఏ ప్రతిపాదనకు అథారిటీ అమోదాన్ని తెలియచేసింది. దీని కోసం ప్రత్యేకంగా ఎల్పీఎస్ నిబంధనలకు కూడా అథారిటీ ఆమోదించింది. గోల్డ్ క్లస్టర్ వద్ద ప్రత్యేక ఎకో సిస్టం వచ్చేలా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. రూ.5 వేల కోట్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని.. 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని సీఆర్డీఏ అథారిటి అభిప్రాయం వ్యక్తం చేసింది. రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామ పంచాయితీల్లో డ్రెయిన్లు, నీటి సరఫరా ఇతర మౌలిక సదుపాయాల కోసం ఎల్పీఎస్ జోన్స్ క్రిటికల్ ఇన్ ఫ్రా అండ్ ఇన్వెస్ట్ మెంట్ ప్లాన్ కింద రూ.904 కోట్లతో పనులు చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. భూసమీకరణ పథకం కింద ఇచ్చే యాజమాన్య ధృవీకరణ సర్టిఫికెట్‌లో అసైన్డ్ అనే పదాన్ని తొలగిచేందుకు కూడా సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని తెలిపింది. అమరావతి రాజధాని నగరంలో సీవరేజ్ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రూ. 411 కోట్లు, అలాగే వాటర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను రూ. 376.60 కోట్లతో ఏర్పాటు చేసేందుకు అథారిటీ అంగీకరించింది. విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు కూడా అదనపు భూ కేటాయింపులు చేసేందుకు సీఎం అధ్యక్షతన అథారిటీ ఆమోదం తెలిపింది. విట్‌కు 100 ఎకరాలు, ఎస్ఆర్ఎంకు 100 ఎకరాల చొప్పున అదనపు భూ కేటాయింపులకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. రాజధానిలో చేపట్టే నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు తెలియచేసేలా ఆన్ లైన్ లో ఉంచాలని అన్నారు. ఈ సీజన్‌లోనే నిర్మాణాలు పూర్తిచేసి రాజధానికి ఒక రూపం తీసుకురావాలన్నారు. ప్రత్యేక వాహక సంస్థ ద్వారా చేపట్టే స్పోర్ట్స్ సిటీ లాంటి ప్రాజెక్టులను అంతర్జాతీయ ప్రమాణాలతో చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. రివర్ ఫ్రంట్ , రోప్ వే, ఇన్నర్ రింగ్ రోడ్డులను అనుసంధానించాలని సీఎం సూచించారు. రాజధాని ప్రాంతంలో కాలుష్య రహిత పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చేలా చూడాలని స్పష్టం చేశారు. త్వరలోనే ప్రతిష్ఠాత్మక బయో ఇంజినీరింగ్ యూనివర్సిటీ కూడా అమరావతికి రానుందని సీఎం పేర్కొన్నారు. దేశంలో మరే ప్రాంతానికీ లేని భౌగోళికపరమైన సానుకూలతలు అమరావతికి ఉన్నాయని... అందుకే ఇక్కడ చేపట్టే నిర్మాణాలన్నీ ఐకానిక్ గా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతీ ప్రాజెక్టు

## తాడిపత్రిలో తీవ్ర ఉద్రిక్తత..

### భారీగా పోలీసు బలగాల మోహరింపు

తాడిపత్రి **ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి :**
అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయ వేడి మరోసారి తారస్థాయికి చేరింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పట్టణంలోకి అడుగుపెట్టనివ్వబోమని టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి తేల్చిచెప్పారు. "కేతిరెడ్డీ.. దమ్ముంటే తాడిపత్రికి రా.. తేల్చుకుందాం" అంటూ బహిరంగ సవాల్ విసిరారు. హైకోర్టు ఆదేశాలతో ఈరోజు పెద్దారెడ్డి తాడిపత్రికి రానున్న నేపథ్యంలో, ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం ముదరడంతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హైకోర్టు ఆదేశాల ప్రకారం, ఈరోజు కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రికి తీసుకురావాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. గతంలో తనను పట్టణంలోకి రాకుండా అడ్డుకున్నారంటూ పెద్దారెడ్డి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, కోర్టు ఆదేశాలు ఎన్ని ఉన్నా పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి రానిచ్చే ప్రసక్తే లేదని జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. "ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కేతిరెడ్డి, ఆయన అనుచరులు చేసిన దౌర్జన్యాలకు, అక్రమాలకు ప్రజలకు సమాధానం చెప్పాలి. చట్టాలు, న్యాయాలు మీకు ఒకలా, మాకు ఒకలా వర్తిస్తాయా?" అని ఆయన ప్రశ్నించారు. తనకు వ్యక్తిగతంగా పెద్దారెడ్డిపై కక్ష లేదని, కానీ ఆయన చేసిన పనులను మాత్రం ప్రజలు మర్చిపోలేదని అన్నారు. ముందు తాడిపత్రికి రావడం కాదు, అక్రమంగా నిర్మించిన తన ఇంటి సంగతి చూసుకోవాలని పెద్దారెడ్డికి హితవు పలికారు.

## కొత్త బార్ లైసెన్స్ విధానాలు ఖరారు

### రెస్టారెంట్ ఉండాలనే నిబంధన సడలింపు

(మొదటి పేజి తరువాయి)

కొత్త వారు ఈ వ్యాపారంలోకి రావడానికి కొన్ని మార్పులు చేశామని వివరించారు. గతంలో బార్ లైసెన్స్ పొందాలంటే రెస్టారెంట్ లైసెన్స్ ముందే ఉండాలని.. ఈసారి ఈ నిబంధన సడలించామని చెప్పుకొచ్చారు. 15 రోజుల్లో రెస్టారెంట్ ఏర్పాటు– చేసుకోవచ్చని సూచించారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షల లైసెన్స్ ఫీజు ఉంటుందని కమిషనర్ నిశాంత్ కుమార్ వెల్లడించారు. 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉంటే రూ.55 లక్షలు లైసెన్స్ ఫీజు ఉంటు–ందని చెప్పారు. అలాగే 5 లక్షలపైన జనాభా ఉంటే లైసెన్స్ ఫీజ్ రూ. 75 లక్షలు ఉంటుందని ప్రకటించారు. ప్రతి ఏడాది పదిశాతం ఈ ఫీజులు పెంచుతామని వెల్లడించారు. గతంలో ఒకేసారి ఆగస్టు నెలలోపు లైసెన్స్ ఫీజు కట్టాల్సి ఉండేదని గుర్తుచేశారు. ఈసారి ఆరుసార్లుగా చెల్లింపులు జరపవచ్చని సూచించారు. గతంలో బార్లు ఉదయం 11గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉండేవని... ఈసారి ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లకు అనుమతి ఉంటు–ందని స్పష్టం చేశారు. అన్ని కేటగిరీల్లో దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలుగా నిర్ణయించామని నిశాంత్ కుమార్ చెప్పుకొచ్చారు.

# ఉక్రెయిన్ సమస్యకు శాంతియుత పరిష్కారమే మార్గం

### మోదీకి ఫోన్ చేసిన పుతిన్.. ట్రంప్‌తో చర్చల వివరాలు వెల్లడి

న్యూఢిల్లీ, **ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి :**
రష్యా–ఉక్రెయిన్ యుద్ధంపై జరుగుతున్న శాంతి చర్చల విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో అలాస్కాలో జరిగిన సమావేశం ముఖ్య వివరాలను, తన విశ్లేషణను మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా, ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారమే సరైన మార్గమని భారత్ మొదటి నుంచి విశ్వసిస్తోందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఈ దిశగా జరిగే అన్ని ప్రయత్నాలకు తమ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫోన్ కాల్ అనంతరం ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. "నా మిత్రుడు, అధ్యక్షుడు పుతిన్ ఫోన్ చేసినందుకు, అలాస్కాలో ట్రంప్‌తో జరిగిన సమావేశం వివరాలను పంచుకున్నందుకు ధన్యవాదాలు. ఉక్రెయిన్ సమస్యకు శాంతియుత పరిష్కారం కోసం భారత్ నిలకడగా పిలుపునిస్తోంది. ఈ విషయంలో జరిగే అన్ని ప్రయత్నాలకు మద్దతిస్తుంది. రాబోయే రోజుల్లో మా మధ్య చర్చలు కొనసాగుతాయని ఆశిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. ఈ సంభాషణలో ఇరు దేశాల మధ్య ఉన్న ప్రత్యేక, ప్రాధాన్యత కలిగిన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పలు ద్వైపాక్షిక అంశాలపై కూడా ఇరువురు నేతలు చర్చించుకున్నారు. గత వారం అలాస్కాలోని ఆర్కిటిక్ వారియర్ కన్వెన్షన్ సెంటర్‌లో పుతిన్, ట్రంప్ మధ్య దాదాపు మూడు గంటల పాటు చర్చలు జరిగాయి. ఈ భేటీలో కొంత పురోగతి సాధించినప్పటికీ, తక్షణమే కాల్పుల విరమణపై ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ఈ చర్చలపై భారత విదేశాంగ శాఖ కూడా స్పందిస్తూ, "పుతిన్, ట్రంప్ మధ్య జరిగిన సమావేశాన్ని భారత్ స్వాగతిస్తోంది. శాంతి స్థాపనలో వారి నాయకత్వం ప్రశంసనీయం. చర్చలు, దౌత్యం ద్వారానే ముందుకు సాగడం సాధ్యం" అని ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, ఈ నెల 8వ తేదీన కూడా పుతిన్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి, ఉక్రెయిన్ పరిణామాలపై చర్చించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, ఈ నెల 21న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాస్కోలో పర్యటించనున్నారు. అక్కడ రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తో సమావేశమై వాణిజ్యం, ఆర్థిక, సాంస్కృతిక సహకారంపై జరిగే అంతర్ ప్రభుత్వ కమిషన్ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి.

# దేశంలో ఓట్ల దొంగలు

హైదరాబాద్ **ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి :**
దేశంలో ఓట్ల దొంగలు పడ్డారని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. బీజేపీ నేతలు దొంగ ఓట్లతో కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారనీ, తెలంగాణలో కూడా ఈ తరహా కుట్రలకు తెరలేపారని చెప్పారు. మహారాష్ట్రలో ఎన్నికల కమిషన్ నాలుగు నెలల్లో కోటి ఓట్లను నమోదు చేసిందని గుర్తు చేశారు. ఈ రకంగా అంబేద్కర్ పుట్టిన గడ్డ మీద రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారని విమర్శించారు. దొంగ ఓట్లతోనే మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఓట్ల చోరీ దేశం నలుమూలలా జరుగుతోందనీ, బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని గుర్తు చేశారు. బతికున్న వారిని చనిపోయినట్టుగా చూపారని తెలిపారు. ఈ కుట్రను రాహుల్ గాంధీ బయటపెట్టారని చెప్పారు. తప్పు చేసిన వారిని వదిలేసి తప్పును ప్రశ్నించిన రాహుల్ గాంధీని ఎన్నికల కమిషన్ అఫిడవిట్ అడగటమేంటని ప్రశ్నించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహ ఏర్పాటుకు సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం రవీంద్రభారతిలో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కును దొంగిలించిన వారిని శిక్షించాలంటూ రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తున్నారనీ, త్వరలో తాను, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆ పాదయాత్రలో పాల్గొని మద్దతిస్తామని తెలిపారు. అందరం కలిసికట్టుగా ఓట్ చోరీ కుట్రదారుల భరతం పట్టాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ సూచనలను అమలు చేయడం తమ బాధ్యతనీ, ఆ క్రమంలో సమస్య వచ్చినప్పుడు పోరాడేందుకు బహుజనులు నైతిక మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్య ఒక్కటే బహుజనుల తలరాతలు మారుస్తుందని రేవంత్ చెప్పారు. నాణ్యమైన చదువు, ఉద్యోగాలు ఇచ్చే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. బహుజనులంతా ఉన్నత చదువులు చదివి రాజ్యాధికారం సాధించాలనీ, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే సమాజం బాగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహనీయుల విగ్రహాలనేవి వర్ధంతులు, జయంతుల కోసం కాదనీ, అవి వారి స్ఫూర్తిని మనలో రగిలించేందుకేనని చెప్పారు. అందుకే రాష్ట్రానికి గుండెకాయ లాంటి సచివాలయం సమీపంలో పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# సీఈసీని తొలగించాలి

(మొదటి పేజి తరువాయి)

మూడింట రెండొంతుల సభ్యుల మెజారిటీతో పార్లమెంట్ తీర్మానం పాస్ చేయాల్సి ఉంటుంది. మిస్ బిహేవియర్ లేదా సదరు బాధ్యతల నిర్వహణకు అర్హత లేదని నిరూపణ అయితే సీఈసీని పదవి నుంచి తొలగించవచ్చు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని, అధికార ఎన్డీయే కూటమి ఓట్ల చోరీకి ఎలక్షన్ కమిషన్ సహకరిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు తీవ్ర వివాదం రేపాయి. ఈ ఆరోపణలపై ఎలక్షన్ కమిషన్ ప్రత్యేకంగా ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఓట్ చోరీ అనే పదం ఉపయోగించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది రాజ్యాంగాన్ని అవమానించడమేనని విమర్శించింది. ఎన్నికల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించడంతో పాటు డిక్లరేషన్ ఇవ్వాలని రాహుల్ గాంధీని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఇందుకు ఏడు రోజులు గడువు ఇస్తూ ఆలోగా డిక్లరేషన్ ఇవ్వకుంటే తన ఆరోపణలు తప్పని ఒప్పుకుంటూ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీకి అల్టిమేటం జారీ చేశారు.

# జనజీవనం అస్తవ్యస్తం

(మొదటి పేజి తరువాయి)

నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, ములుగు, సంగారెడ్డి, కామారెడ్డి, మంచిర్యాల, కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరామసాగర్ ప్రాజెక్ట్‌కు భారీగా వరద వస్తోంది. స్థానికంగా కురుస్తున్న వర్షాల తోపాటు మహా రాష్ట్ర నుంచి పెద్దఎత్తున వరద వస్తుండటంతో గోదావరి నది గుండా ప్రాజెక్టులోకి ప్రవహిస్తూ ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1,25,400 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అధికారులు ప్రాజెక్టు 8 గేట్ల నుంచి 25వేల క్యూసెక్కుల నీటిని గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. క్రమంగా వరద పెరగడంతో సాయంత్రానికి 39 గేట్లు ఎత్తారు. ఎగువ ప్రాంతాల నుంచి లక్ష 52వేల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్టు ప్రాజెక్టు ఎస్ఈ తెలిపారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను తెరిచారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం19 ఆగస్టు 2025

## పిజిఆర్ఎస్ అర్జీలు పెండింగ్ లేకుండా

# ఎప్పటికప్పుడు పరిష్కరించాలి.

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 18:**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చూపకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రజలు జిల్లా నలుమూలల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం పిజిఆర్ఎస్ సమావేశానికి వస్తుంటారని అధికారులు వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన



అవసరం ఎంతైనా ఉందన్నారు.
అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్మెంట్ వారికి అర్థమయ్యే విధంగా స్పష్టంగా ఇవ్వాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా నిర్దేశించిన గడువు లోపల పరిష్కరించాలన్నారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని దరఖాస్తులు.**

1. కొలిమిగుండ్ల మండలం, మదనంతపురం గ్రామానికి చెందిన ఎస్. పెద్ద శేఖర్ తనకు సొంత ఇల్లులేదని ప్రస్తుతం బాడగింట్లో ఉంటున్నామని నాకు ఇంటి స్థలం మంజూరు చేయించగలరని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. 2. ప్యాపిలి మండలం, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పి.మద్దయ్య సర్వే నెంబర్ 81/65లో ఎకరా భూమి తన పేరు మీద ఉంది. ఈ భూమిని రీసర్వే చేయగా రీ సర్వేలో ఎకరా కంటే తక్కువగా చూపిస్తూ హద్దులు నాటారు కావున తన భూమి తనకు ఖచ్చితమైన హద్దులు చూపించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. 3. గడివేముల మండలం, గడివేముల గ్రామానికి చెందిన కత్తి శ్రీనివాసులు తనకు వస్తున్న వికలాంగుల పెన్షన్ ను తొలగించడం జరిగిందని తిరిగి తనకి పెన్షన్ పునరుద్ధరించాలని కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.
ఇంకా ఈ కార్యక్రమంలో పలు సమస్యలపై బాధితులు కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.
ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

### - మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశం.

### సంతోషం వ్యక్తం చేసిన అవుకు, చెర్లోపల్లె గ్రామ రైతులు.




**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె ఆగస్టు 18:**
అవుకు సమీపంలోని తిమ్మరాజు రిజర్వాయర్ ఆయకట్టు కింద ఉన్న బిళ్ళగడ్డ పొలాలకు సంబంధించిన అవుకు, చెర్లోపల్లె గ్రామాల రైతులు కొన్ని సంవత్సరాలుగా తీవ్రమైన సాగు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు.. ఆయా రైతుల పంట పొలాలకు సాగు నీటి సరఫరా సరిగా అందకపోవడం వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ తిమ్మరాజు చెరువు నీటి సంఘం ప్రతినిధులు %ఢ% ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రమణ నాయక్ రైతులతో కలిసి మంత్రి దృష్టికి తీసుకురావడం జరిగింది.ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.. తక్షణమే రెవెన్యూ అధికారులు మరియు, ఎస్సార్ బీసీ కెనాల్ అధికారులకు సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో అధికారులు వెనువెంటనే స్పందించి రైతులకు తాత్కాలిక పరిష్కారం చూపడం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ రోజు మళ్లీ క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసిన రైతులు తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరడం జరిగింది.. దీంతో మరోసారి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఎస్సార్ బీసీ అధికారులతో ఫోన్ లో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించడం జరిగింది. ఈ నేపథ్యంలో అవుకు, చెర్లోపల్లి గ్రామ రైతులు మంత్రి కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేయడం జరిగింది. కార్యక్రమంలో చెర్లోపల్లి మరియు అవుకు గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

## మంత్రి నిర్మలా సీతారామన్ తో

# ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భేటీ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 18:** న్యూ ఢిల్లీలో సోమవారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ తో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి సమావేశమయ్యారు. ఆంధ్ర రాష్ట్రానికి చెందిన పలు సమస్యలు, నంద్యాల జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన నిధులపై ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి దృష్టికి తెచ్చారు. అదేవిధంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ..మీకు మంచి ఆరోగ్యం, ఆనందం, దేశానికి అంకితభావంతో సేవ చేయడానికి నిరంతర శక్తి ఆ దేవుళ్ళు ప్రసాదించాలని కోరుకుంటున్నానన్నారు.

## భూ నిర్వాసితుల కు అండగా నిలిచిన శ్రీనివాసరావుని అరెస్టు చేయడం సిగ్గుచేటు.

**కరేడు లో బలవంతపు భూసేకరణ ఆపాలి.**

**అరెస్టు చేసిన సిపిఎం, రైతు సంఘం నాయకులను వెంటనే విడుదల చేయాలి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 18:**
నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మూడు కార్లు పంటలు పండే 8000 ఎకరాల భూమిని ఇండోసోల్ కంపెనీకి అప్పగించడానికి బలవంతంగా రైతుల నుండి భూసేకరణ చేయటాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు సిపిఎం పార్టీ, ప్రజాసంఘాలు చలో కరేడు కార్యక్రమం లో భాగంగా అక్కడికి వెళ్లిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు గారిని మరియు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర,జిల్లా మండల గ్రామ నాయకులను, ప్రజలను బలవంతంగా పోలీసులు అరెస్టు చేసి, బలవంతంగా ఈడ్చుకుంటూ వెహికల్స్ లో ఎక్కించి పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని ఖండిస్తున్నామని, ఇలా చేయటం సిగ్గుచేటని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. రామచంద్రుడు సిపిఎం జిల్లా నాయకులు వి. బాల వెంకట్ గార్లు సంయుక్త ప్రకటన ద్వారా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా రైతుల నుండి బాగా పంటలు పండి భూముల్ని లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం దుర్మార్గమైన చర్య అని, అందులో భాగంగానే కరేడు గ్రామంలో 8000 ఎకరాల భూమిని ఇండోసోల్ కంపెనీకి అప్పగించే ప్రయత్నంలో జులై 4వ తేదీన గ్రామసభ నిర్వహిస్తే గ్రామంలోని ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించి, విలువైన మా భూములను ఇండోసూల్ కంపెనీకి ఇచ్చేది లేదని తెగేసి చెప్పి , గ్రామసభ తీర్మానం చేశారు. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా కార్పొరేట్లకు అమ్ముడుపోయి వారి స్వప్రయోజనాల కోసం ఊడిగం చేస్తూ, రైతుల కడుపు కొట్టి గ్రామంలోని ప్రజలందరికి ఉపాధి లేకుండా చేసేందుకై కంకణం కట్టుకున్నది. అందుకు ఒప్పుకోని కరేడు గ్రామ రైతులు ప్రజలు రాజకీయాలకతీతంగా ఐక్యంగా నిలిచి బలవంత భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అందుకు రాష్ట్రంలోని సిపిఎం, వామపక్షాలు, రైతు సంఘాలు కారేడు గ్రామ ప్రజలకు అండగా నిలబడి చలో కరేడు కార్యక్రమం లో పాల్గొనుటకు వచ్చిన సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాసరావు ని బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ వ్యాన్లలో ఎక్కించడం చూస్తే రాష్ట్రంలో నియంతల పరిపాలన అమలవుతున్నట్టు కనిపిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా పేద రైతులు ప్రజల కడుపులు కొట్టి బలవంతంగా వారి నుండి లక్షలాది ఎకరాలభూములు లాక్కొని , కేవలం వందల ఎకరాల్లో మాత్రమే పరిశ్రమలు పెట్టి మిగిలిన భూములను కార్పొరేట్ కంపెనీల రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జరుపుకోవతానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సాగిస్తున్నదనీ, మాటల్లో రైతుల గురించి గొప్పగా ప్రచారం చేసుకోవడం తప్ప ఆచరణలో రైతుల నడ్డి విరిగేలాగా విధానాలను అవలంబిస్తున్నది అన్నారు.కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అక్రమంగా, దౌర్జన్యంగా అరెస్ట్ చేసిన సిపిఎం, రైతు సంఘం నాయకులను వెంటనే విడుదల చేయాలని, కరేడులో బలవంతపు భూసేకరణను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. అట్లా జరగనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం ఆందోళన నిర్వహిస్తారని తెలిపారు.

# డ్వాక్రా మహిళల ఆర్థిక అభివృద్ధికి ఎగ్ కార్ట్ లు.

**రూ. 50, వేలు విలువచేసే ఎగ్ కార్ట్ ను డ్వాక్రా మహిళలకు అందజేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 18:**
డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎగ్ కార్టు లను అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పిజిఆర్ఎస్ హాల్లో నంద్యాలకు చెందిన ఇదాయతున్ మరియు కళ్యాణి అనే ఎస్ హెచ్ జి మహిళలకు ఎగ్ కార్ట్ లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం డిఆర్డిఏ వెలుగు శాఖల ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యుల అభివృద్ధికి ఎగ్ కార్ట్ లను ఇవ్వడం జరిగిందన్నారు. ఇవి మన జిల్లాకు మొత్తం 100 కార్టులు అందజేయడం లక్ష్యం కాగా... అందులో మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన వారికి 40 ఎగ్





కార్టులను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. మిగిలిన వాటిని నిర్ణీత ధర చెల్లించిన వారికి అందజేస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాకు వచ్చిన 10 ఎగ్ కార్టులు వచ్చాయని చెప్పారు. వాటిని అర్హులైన వారికి అందజేయడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క ఎగ్ కార్ట్ 50 వేల రూపాయలు విలువ చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఎవరైతే ఎస్ హెచ్ జి సభ్యులు తోపుడుబండ్ల మీద బజ్జీలు, పకోడీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారో వారిని గుర్తించి తోపుడు బండి లాంటివి లేకుండా నూతనంగా ఏర్పాటుచేసిన ఎగ్ కార్ట్ లను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎగ్ కార్ట్ ద్వారా కస్టమర్లకు మంచి నాణ్యమైన ఆహారం అందించాలని ఇందులో తప్పకుండా ఎగ్ వెరైటీ ఫుడ్స్ చేయాలన్నారు. గుడ్డు తినడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని వీరు చేసే వంటకాలలో గుడ్డు ఉండేటట్లు చూడాలని డ్వాక్రా మహిళలకు సూచించారు.
ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి, స్వయం సహాయక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలి.

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 18:**
ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలి. అవయవ దానం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి జీవితంలో వెలుగులు నింపే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో... జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో గత జూన్ మాసంలో మొట్టమొదట అవయదానం చేసిన మహిళ బొప్ప సుజాత గారి కుటుంబ సభ్యులకు 50 వేల నగదు పారితోషము, ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందజేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నంద్యాల మండలం గుంతనాల గ్రామ నివాసి బొప్పా సుజాత గోస్పాడు మండలం తేళ్లపూరి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుండేవారు. గత జూన్ నెల ఒకటో తారీఖున ఆమె రోడ్డు ప్రమాదనికి




గురవ్వగా.. తనను బతికించడం కోసం డాక్టర్లు తీవ్రంగా కృషి చేశారు. అయినా ఆమె బ్రెయిన్ డెత్ కు కావడంతో వారి సోదరి డాక్టర్ విజయ, సోదరుడు సునీల్ కుటుంబ సభ్యులను అవయవ దానం కోసం ఒప్పించి రెడ్ క్రాస్ ను సంప్రదించారు. ఈ మేరకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జూన్ 5వ తేదీన అవయవ దానము చేయించి ఏడు మంది జీవితాలలో వెలుగు నింపేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి నగదు పారితోషికంగా 50వేల రూపాయలు కలెక్టర్ అందజేయడంతో పాటుగా డాక్టర్ విజయా, ఆమె సోదరునికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.
ఈ సందర్భంగా అవయవ దానం చేసిన బొప్పా సుజాత సోదరి డాక్టర్ విజయ మాట్లాడుతూ... అవయవ దానంపై చాలామందికి అపోహలు ఉన్నాయని.. మన కుటుంబ సభ్యులు ఎవరైనా చనిపోయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల తమ మనుషులు బ్రతికి ఉన్నారన్న సంతృప్తి కలుగుతుందన్నారు. తన సోదరి అవయవాలు దానం చేయాలని నిర్ణయించుకున్నా, ఏ విధంగా ముందుకు వెళ్లాలో తోచలేదని.. ఆ సమయంలో రెడ్ క్రాస్ ను సంప్రదించామని చెప్పారు. ఆ సందర్భంలో ప్రభుత్వానికి సంబంధించిన అన్ని శాఖలు తమకు సహకరించాయని ఇందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేసి సి విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, రెడ్ క్రాస్ మాజీ చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల వల్ల జరిగే ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని

# జిల్లా పోలీస్ లకు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలు.

**జిల్లావ్యాప్తంగా ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, నదుల వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు తెలుసుకుంటున్నా పోలీస్ అధికారులు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ ఆగస్టు 18:**
విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ హెచ్చరిక ఉన్న నేపధ్యంలో నంద్యాల జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని,పోలీస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అప్రమత్తతో వ్యవహరించాలని అధికారులను నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు ఎస్పీ గారు కొన్ని సూచనలు చేశారు. భారీ వర్షం లేదా ఈదురుగానుల సమయంలో ప్రజలు స్తంభాలు లేదా చెట్ల కింద నిలబడవద్దు.వర్షం కారణంగా రోడ్లపై నీరు నిలుచున్న ప్రదేశాలలో , రోడ్డు పక్కన కాలువలో నీరు పైకి ప్రవహించే ప్రదేశాలలో ప్రజలు అప్రమత్తలతో వ్యవహరించాలి.ముఖ్యంగా మట్టి మిద్దెలలో ఉన్న వారు శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలో ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలి. వర్షం పడే సమయంలో సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి.చెరువులు, కుంటలు, నదులు, కాలువలు మరియు ఇతర జలాశయాలను నిరంతరం పోలీసు అధికారులు పర్యవేక్షించాలి. ప్రమాదకర స్థాయిలో నీరు ఉన్న ప్రదేశాలలో, లోతును సూచించే మరియు ప్రమాదం గురించి హెచ్చరించే బోర్డులను ఇతర శాఖలతో



సమన్వయం చేసుకుంటూ ఏర్పాటు చేయాలి ఉదాహరణకు, “లోతుగా ఉంది, దయచేసి దూరంగా ఉండండి”, “ఈత కొట్టడం నిషేధం”, “పిల్లలు లోపలికి అనుమతించబడరు” వంటి సంకేతాలు ఉపయోగించాలన్నారు.గ్రామ ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఉధృతంగా ప్రవహించే కాలువల వద్దకు పిల్లలు వెళ్లకుండా చూడాల్సిన ఆవశ్యకతను వివరించి నీటిలో దిగడం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను నీటి వనరుల దగ్గరకు వెళ్లకుండా చూసుకోవాలని, ముఖ్యంగా వర్షాలు పడుతున్నప్పుడు లేదా నీటిమట్టాలు ఎక్కువగా ఉన్నప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్న ప్రాంతాలు, కట్టలు బలహీనంగా ఉన్న ప్రదేశాలు, మరియు చరిత్రలో వరదలు వచ్చిన ప్రాంతాలను గుర్తించి ఇతర శాఖల సమన్వయంతో ప్రజలను అప్రమత్తం చేయాలి.
నిరంతరం ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఏదైనా కాలువలు ప్రమాదకర స్థాయిలో ఉంటే లేదా వరదలు వచ్చే అవకాశం ఉంటే, వెంటనే సంబంధిత స్థానిక పరిపాలనాధికారులకు అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు సమాచారం తెలియజేయాలని కోరారు. వర్షాకాలంలో వరదలు వచ్చే అవకాశం ఉంటే, గ్రామస్తులకు ముందస్తు హెచ్చరికలు అందించడానికి ఏర్పాట్లు చేయాలని (ఉదాహరణకు, మైకులు, మొబైల్ సందేశాలు) చెప్పారు.ప్రజలను తరలించాల్సిన అవసరం ఏర్పడితే, సురక్షితమైన ఎత్తైన ప్రదేశాలను ముందుగానే గుర్తించాలన్నారు.వర్షాకాలంలో ప్రజల భద్రతకు సంబంధించి జిల్లా పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తుండాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# చిన్నారిని కాపాడిన ఉద్యోగులు, పోలీసులు.



**ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 18:** మహానంది క్షేత్రంలో ఒక చిన్నారిని స్థానిక ఆలయ ఉద్యోగులు, పోలీసులు కాపాడారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ ప్రాంతానికి చెందిన ఒక కుటుంబం కారులో మహానంది క్షేత్రానికి దైవ దర్శనర్థమై ఆదివారం మహానందికి చేరుకున్నారు. క్షేత్రంలోని నంది సర్కిల్ వద్ద వారు కారును ఆపి ఒక సంవత్సరం వయసు కలిగి ఉన్న చిన్నారిని కారులో ఉంచి కారు అద్దాలు పూర్తిగా మూసివేసి ,కారుకు తాళం వేసి అక్కడి నుండి క్షేత్రంలోనికి దైవ దర్శనార్థమై వెళ్లిపోయారు. దీంతో కారులో ఉన్న ఆ చిన్నారి ఊపిరాడక చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండగా దీనిని గుర్తించిన ఆలయ ఉద్యోగి ఈశ్వర్, కానిస్టేబుల్ చంద్రశేఖర్ మరో ఆలయ తాత్కాలిక ఉద్యోగి నాగార్జున రెడ్డి లు కలిసి కారు అద్దాలు పగలగొట్టి ఆ చిన్నారిని రక్షించారు. అనంతరం ఆ చిన్నారి తల్లిదండ్రులను మందలించి వారి కి ఆ చిన్నారిని అప్పగించారు. ఆ చిన్నారి తల్లిదండ్రులు తమ బిడ్డ ప్రాణాలు కాపాడినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకుంటామని తాము చేసిన తప్పిదం వల్ల తమ బిడ్డ ప్రాణాలు గాలిలో కలిసి పోయేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పలువురు ఆలయ ఉద్యోగులు, పోలీసులు, స్థానికులు ఆ చిన్నారిని కాపాడినందుకు వారిని అభినందించారు.

## మహానంది కానిస్టేబుల్ చంద్రశేఖర్ కు
# హెూం మంత్రి అనిత అభినందనలు.



**ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 18:** మహానంది పుణ్యక్షేత్రానికి కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ ప్రాంతానికి చెందిన రాజు కుటుంబ సభ్యులతో కారులో దైవ దర్శనర్థమై ఆదివారం మహానందికి వచ్చారు. క్షేత్రంలోని నంది సర్కిల్ వద్ద వారు కారును ఆపి చిన్నారిని లోపలే ఉంచి దైవ దర్శనార్థమై వెళ్లారు. కారు అద్దాలన్నీ లాక్ పడిపోవడంతో చిన్నారికి ఊపిరాడక,ఈ ఏడ్పును మహానందిలోని స్థానికులు కారులో నుంచి కనబడుతున్న చిన్నారిని గమనించి దేవస్థానం సమాచార కేంద్రంలోని దేవస్థానం ఉద్యోగులు వారు అక్కడికి వచ్చి చూసే సమయానికి సమీపంలోని పోలీస్ స్టేషన్కానిస్టేబుల్ చంద్రశేఖర్ ఎవరికో దర్శనం చేయించేందుకు వెళుతున్నారు. కారులో పాప చిక్కుకున్న విషయాన్ని తెలుపగా,వెంటనే మహానంది ఎస్ఐ ఎన్ రామ్మోహన్ రెడ్డికి సమాచారం అందజేసి కారు అద్దాలను పగులగొట్టి చిన్నారిని సురక్షితంగా బయటకు తీసి ఒక నిండు ప్రాణాన్ని కాపాడారు.దీంతో కానిస్టేబుల్ చంద్రశేఖర్ ను మహానంది ఎస్సై రామ్మోహన్ రెడ్డి, పోలీస్ స్టేషన్ సిబ్బంది, పలువురు అభినందించడమే కాక, రాష్ట్ర హెూం మంత్రి అనిత కూడా అభినందించారు.

# వాగులు దాటే ప్రయత్నం చేయొద్దు.
## ఎస్ ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 18:** అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మహానంది మండలం ఎంసీ ఫారం గ్రామం సమీపంలోని పాలేరు వాగును పరిశీలించారు. ఉదృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. నల్లమల్ల అడవి ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయన్నారు.రాత్రి సమయంలో పాలేరు వాగు అధికంగా నీరు ప్రవాహం ఉండే అవకాశం ఉందన్నారు. ఆ సమయంలో వాగు దాటడానికి ప్రయత్నించవద్దని తగు సూచనలు చేశారు.

## కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంను
# ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి బిసి.







**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె ఆగస్టు 18:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన వసతి, భోజన సదుపాయాలు.. నాణ్యమైన విద్యనందించాల్సిన ఆవశ్యకత ఉందన్న రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి...లి సోమవారం నాడు బనగానపల్లెలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు.బనగానపల్లెలో ప్రస్తుతం ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ను రూ. 2.5 కోట్ల నిధులతో అదనంగా మరో 6 నూతన రూమ్ లు నిర్మించి, జూనియర్ కాలేజీగా విస్తరింప చేస్తామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో నూతన భవనాల నిర్మాణంకు స్థలంను పరిశీలించి, పలు సూచనలు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీ లో విద్యార్థినుల క్లాస్ రూమ్ లను ప్రత్యేకంగా పరిశీలించిన మంత్రి,విద్యార్థినులకు పాఠశాలలో టీచర్ల అందిస్తోన్న భోధన, ఆహార, వసతి సదుపాయాలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్న మంత్రి,అనంతరం ప్రభుత్వం ఇస్తున్న స్కూల్ బ్యాగులు, డ్రెస్ ల నాణ్యత గురించి విద్యార్థినుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్న మంత్రి గతంలో కంటే నేడు నాణ్యతగా ఉన్నాయని మంత్రికి సమాధానం ఇచ్చిన విద్యార్థులు,తల్లికి వందనం అందరికీ వచ్చిందా అని మంత్రి విద్యార్థులను ప్రశ్నించగా వచ్చిందని ముక్తకంఠంతో చెప్పినవిద్యార్థులు,విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం పెడుతున్నారా... భోజన మెనూ ఎలా ఉంటుందని అడగగా, బాగుందని సమాధానమిచ్చిన విద్యార్థినులు,బాగా చదువుకని, మంచి ఉత్తీర్ణత సాధించి.. స్కూలుకు, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించిన మంత్రి,అదే సమయంలో ఆయా విద్యార్థినులను ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించిన మంత్రి,విద్యార్థులు తమ బట్టలు శుభ్రం చేసుకోవడానికి దోబీ ఘాట్ కావాలని కోరగా, నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు మంత్రి ఆదేశం,ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి,పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న తాగునీటి సదుపాయం, వాటర్ ప్లాంట్ పనితీరును స్వయంగా పరిశీలించిన మంత్రి,పాఠశాల స్టోర్ రూమ్ లో ఆహార సామాగ్రి నాణ్యతను, కిచెన్ రూమ్ ను పరిశీలించి చేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పలు సూచనలు చేశారు.

# ఫిర్యాదులను విచారణ జరిపి చట్ట పరిదిలో న్యాయం చేస్తాం.

**ఫిర్యాదిదారుల సమస్యలను నిర్ణీత గడువు లోపల పరిష్కరించండి. - జిల్లా ఎస్పీ. అధిరాజ్ సింగ్ రాణా.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ ఆగస్టు 18:** నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదిదారుల నుంచి 66 ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేయడం, పొలం తగాదాలు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయి.

1). బండిఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కే.చిన్న మద్దిలేటి మరి కొంతమంది రైతుల యొక్క 60 లక్షల విలువ గల 4000 వరి ధాన్యం బస్తాలు బండిఆత్మకూరు మండలం చిన్న దేవలాపురం గ్రామానికి చెందిన వడ్ల వ్యాపారి శాఖమూరి.సుబ్బారెడ్డి కొని వారం రోజులలో డబ్బులు ఇస్తానని కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో వాటిని అమ్మి డబ్బులు పోవు చేసుకుని మాకు ఇవ్వకుండా మమ్మల్ని మోసం చేస్తున్నాడని నాకు న్యాయం చేయండని జిల్లా ఎస్పీ కి రైతులు ఫిర్యాదు చేశారు.

2). నాకు ఉద్యోగం ఇప్పిస్తానని లక్క. హరి ప్రసాద్ నా వద్ద నుండి 99,000/- రూపాయలు ఫోన్ పే ద్వారా తీసుకుని ఇంతవరకు జాబ్ చూపించకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఉన్నాడని నాకు న్యాయం చేయండని పాణ్యం మండలం భూపనపాడు గ్రామానికి చెందిన డి.వినోద్ జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

3).హైదరాబాదులో నివాసం ఉంటున్న విజయ శ్యామలాదేవి నుండి 6.08 సెంట్లు పొలం కొనుటకు 67,50,000/-అగ్రిమెంట్ రాయించుకుని లక్ష రూపాయలు అడ్వాన్స్ గా ఇవ్వడం జరిగింది. ఎన్నిసార్లు సంప్రదింపులు జరిపిన సమాధానం లేదు కావున వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయండని రుద్రవరం మండలం డి. కొట్టాల గ్రామానికి చెందిన శరభారెడ్డి జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

4).ఆకుల. రమేష్ యాదవ్ మీసేవ కోఆర్డినేటర్ గా మరియు డాక్యుమెంట్ రైటర్ గా బండి ఆత్మకూర్ నందు పనిచేయుచున్నాడు. ఆధార్ సెంటర్ మంజూరు కావాలంటే బోయ రాజశేఖర్ కి 20,000/- రూపాయలు పంపమని చెప్పగా నేను పంపించాను. డబ్బులు తిరిగి ఇవ్వకుండా మరియు ఎలాంటి అనుమతులు ఇప్పించకుండా ఇబ్బంది పెడుతున్నాడని నాకు న్యాయం చేయండని నంద్యాల టౌన్ కు చెందిన ముస్తాక్ భాష జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

# ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం చిన్న జిల్లాలకు వర్తింపజేయాలి.

**నిరుద్యోగ యువత కోసం పార్లమెంట్ లో ప్రస్థావించిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 18:** ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం చిన్న జిల్లాలకు కూడా వర్తింప జేసి నిరుద్యోగ యువత, విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉండాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి సోమవారం పార్లమెంట్ లో నిరుద్యోగ యువత, విద్యార్థుల కోసం ప్రశ్నించారు. పార్లమెంట్ లో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఇంటర్న్షిప్ పథకం లో యువత, విద్యార్థుల నుండి భారీ ఆసక్తి ఉన్నప్పటికీ, దానిలో తక్కువ భాగస్వామ్యం ఉందన్న కారణంగా అర్హులైన వారికీ న్యాయం జరగడం లేదన్నారు. ఈ పథకంలో ఉన్న ప్రస్తుత స్టైపెండ్ నిర్మాణం సరిపోదని, ముఖ్యంగా టైర్-1 నగరాల్లో ఉందని హైలైట్ చేసి, మద్దతును సవరించాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. టైర్-2 నగరాలు, చిన్న జిల్లాలకు కూడా ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం వర్తించేలా సవరణ చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె కోరారు, దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా 7 లక్షల మంది అర్హులు కాగా, 6 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా కేవలం 8 వేల మందికి మాత్రమే అవకాశాలు ఉన్నాయని, నా నంద్యాల జిల్లాలో 372 ఆఫర్లకు గాను 3000 వేల దరఖాస్తులు చేసుకోగా, 30 మందికి మాత్రమే అవకాశం ఉందని, నెలకు రూ. 5 వేల స్టైఫండ్ సరిపోదని, వీటిని కూడా పెంచాలని, వీటివల్ల అర్హులైన యువతకు సరైన న్యాయం జరగదని, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకంలో సవరణలు చేసి, చిన్న జిల్లాలకు వర్తింపజేసి, నిధులు పెంచి అర్హులైన వారందరికీ సహాయం చేయాలని యువత కోసం పార్లమెంట్ లో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు.

## ఎస్సార్ బీసీ కాలువలు దూకి
## ఆత్మహత్య చేసుకోవాలనుకున్న
# దంపతులను కాపాడిన పోలీసులు.

**- బనగానపల్లి ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్.**




**ఆంధ్ర ప్రగతి బనగానపల్లి ఆగస్టు 18:**నిన్నటి దినం అనగా 17 వ తేదీఆదివారం సాయంత్రం సుమారు 05 గంటలకు అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన చిన్న మద్దిలేటి అనే వ్యక్తి బనగానపల్లె కి సిఐ ప్రవీణ్ కుమార్ కి ఫోన్ చేసి తన అన్న మద్దిలేటి, వదిన శశికళ లు అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో బనగానపల్లె వెట్కపు వచ్చినారని, ఆత్మహత్య చేసుకునే ముందు సమాచారం ఇస్తున్నామని తన వదిన తనకు ఫోన్ ద్వారా తెలిపిందని, తాను, తన బంధువులు ప్రస్తుతం అవుకు మండలం రామాపురం గ్రామంలో ఉన్నామని తాము సమయానికి చేరుకోలేని పరిస్థితుల్లో ఉన్నందున వారిని వెతికి కాపాడవలసిందిగా అభ్యర్థించగా, సి ఐ ప్రవీణ్ కుమార్, వెంటనే సదరు ఫోన్ నెంబర్ ను ఆ వ్యక్తి ద్వారా తెలుసుకొని నంద్యాల జిల్లా ఎస్పీ సహకారంతో ఆ ఫోన్ నంబర్ లోకేషన్ తెలుసుకొని, ఎస్సై దుగ్గి రెడ్డి మరియు సిబ్బందిని సదరు దంపతులు వున్న రవ్వలకొండకు వెళ్లే మార్గంలో ఎస్సార్ బీసీ కాలువ వంతెన పై ఉన్నట్లు గుర్తించి వారిని ఆత్మహత్య ప్రయత్నం చేయకుండా నివారించడమైనది. అనంతరం ఎస్సై వారిరువురిని సి ఐ దగ్గరకి తెచ్చి హాజరు పరుచుగా, వారు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను విచారించగా, వారు తమకు మూడు లక్షల రూపాయల అప్పులు ఉన్నాయని, తాము కూలి పని చేసుకుంటూ ఆ అప్పులను తీర్చే మార్గం కనిపించక, కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుందామని ఉద్దేశంతో బనగానపల్లె ఎస్సార్ బీసీ కెనాల్ దగ్గరకు వచ్చినట్లు తెలిపినారు. సి వి వారితో మాట్లాడుతూ జీవితం చాలా అమూల్యమైనదని, చిన్న చిన్న విషయాలకే ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం సరికాదని, సంకల్పంతో కష్టాలను అధిగమించాలని వారికి మనోధైర్యం చెప్పి వారి బంధువులతో పాటుగా సదరు దంపతులను ఇంటికి పంపడం జరిగింది. సకాలంలో వెళ్లి రెండు నిండు ప్రాణాలు కాపాడిన బనగానపల్లె ఎస్సై దుగ్గి రెడ్డి ని మరియు బనగానపల్లె పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# సంక్షేమ హస్టల్ కి రేగ్యులర్ వార్డెన్ ని నియమించాలి.

**సాంఘిక సంక్షేమ హాస్టల్ వార్డెన్ ను సస్పెండ్ చేయాలి. -మెను పాటించని హాస్టల్.**




**ఆంధ్ర ప్రగతి ఓర్వకల్లు ఆగస్టు 18:** ఓర్వకల్లు మండలం కేంద్రంలో ఉన్న బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్ లో 6 మంది విద్యార్థులకు ఫూడ్ పాయిజన్ అవ్వడం జరిగింది. అనంతరం రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్ర నాథ్. ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్న.రైతు సంఘం మండల కార్యదర్శి సుదకార్.ఎఐ వైఎఫ్ మండల కార్యదర్శి మహబుబ్ బాషా. లు మాట్లడుతు సాంఘిక సంక్షేమ హాస్టల్ లో 100 మంది విద్యార్థులు ఉండగా తక్కువ సంఖ్యలో ఉన్న విద్యార్థులకు సరిగ్గా అన్నం లేకపోవడం చాలా బాధకరమైన విషం అని అన్నారు. అలాగే హాస్టల్ లో ఉన్న విద్యార్థులకు కుళ్లిపోయిన కురగాయలతో చాలిచాలని అలాగే ఉడికి ఉడకాని అన్నం పెడుతున్నారు అని అన్నారు. అంతే కాకుండా సంక్షేమ హాస్టల్ లో మెను ప్రకారం విద్యార్థులకు అన్నం పెట్టాకుండ అంత నా ఇష్టమే అంటున వంట మాస్టర్ అని అన్నారు. అంతే కాకుండా సాంఘిక సంక్షేమ హాస్టల్ లో మౌళిక సదుపాయలు లేక విద్యార్థులు నాన అవస్థలు పడుతుంటే వార్డెన్ మాత్రం ఓర్వకల్లు ఎస్సీ సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ కు ఇన్చార్జ్ గా ఉండటం వల్ల విద్యార్థులు ను పట్టించుకోనే నాదుడే లేరు అని వారు అన్నారు. అనంతరం మండల ఎమ్మార్వో అఫీస్ ఎదుట ధర్నా నిర్వహించి ఓర్వకల్లు మండల ఎమ్మార్వో విద్యాసాగర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. స్పందించి ఎమ్మర్వో విద్యార్థుల సమస్యలు ఎవైన సరే తోందరగా తిరుస్తామని అలాగే విద్యార్థులకు మెరుగైన అహరం అందించేలా చేస్తానాని అలాగే వార్డెన్ పై చర్యలు తిసుకుంటామని వారు తేలిపారు. అనంతరం ఈ కార్యక్రమం లో నాయకులు మధు రామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రభ
తెలుగు దినపత్రిక
మంగళవారం19 ఆగస్టు 2025

# విద్యార్థుల మెస్ విధానాన్ని అక్షయపాత్రకి ఇవ్వాలన ఆలోచన విరమించుకోవాలి.

## ఆర్ఎస్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్ డిమాండ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 18:** విద్యార్థుల మెస్ ను అక్షయపాత్ర కు ఇస్తున్నట్టు ఆరోపణ వస్తున్నాయి.. అక్షయపాత్ర యాజమాన్యంపై గతంలో అనేక ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో అక్షయపాత్ర కు ఇవ్వడం వలన విద్యార్థులకు పోషక ఆహారం కూడా అందలేదన్నట్టు అనేక ఆరోపణలు మనం చూస్తున్నాము. అలానే మన త్రిబుల్ ఐటీ లో కూడా వారికి ఇచ్చినట్టయితే విద్యార్థులకు పోషకాహారం అందకపోవచ్చు . చికెన్. గుడ్డు వంకాయలను అక్షయపాత్ర సంస్థ మెనూలో నుండి తీసేస్తుంది. ఉల్లిపాయ తెల్లగడ్డ లాంటి వాటిని కూడా ఉపయోగించరు. దీనివల్ల విద్యార్థినిలకు ఆరోగ్య సమస్యలు కూడా వచ్చే దానికి అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అంతేకాక ఇప్పుడు మెస్ నిర్వాహకులు కంటే అక్షయపాత్ర సంస్థకి అధిక ధర చెల్లించవలసిన పరిస్థితి వస్తుంది. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై మరింత భారం పడుతుంది. కావున ఇప్పుడు ఉన్న మెస్ నిర్వాహకుల కే మెస్ బాధ్యతలు ఇచ్చితే విద్యార్థులకు చికెన్. గుడ్డు తోపాటు మరింత నాణ్యమైన ఆహారం అందించగలరు. పై విషయాలను పరిగణలోకి తీసుకొని అక్షయపాత్రకు ఐ ఐ ఐ టి మెస్ నిర్వహణ ను ఇవ్వొద్దని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ గా మేము విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ విషయం పైన మేము కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామని మీకు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షుడు పరుచూరి అవినాష్,జిల్లా ఉపాధ్యక్షుడు తేళ్ళ వర్షిత్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాగ్. శామ్యూల్,శివ,కన్నప్ప,కోటి తదితరులు పాల్గొన్నారు.

# తంగేడంచ ఫారం భూములను ధ్వంసం చేస్తే ఉద్యమిస్తాం.

## భూముల్లో ఏర్పాటు చేసే పరిశ్రమలపై ప్రజలకు తెలియాలి.

## 75% స్థానికులకు ఉపాధి కల్పించాలి. ముఖ్యమంత్రి హామీ నిలబెట్టుకోవాలి.

## సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు.



**ఆంధ్ర ప్రగతి జూపాడు బంగ్లా ఆగస్టు 18:** గత 2017 టిడిపి హయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి హెూదా లో ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు గారు తంగడంచ ఫారం 1600 ఎకరాల ప్రభుత్వ భూముల్లో పరిశ్రమల నెలకొల్పి అభివృద్ధి చేసి 75% స్థానిక నిరుద్యోగ యువకులకు అవకాశం కల్పిస్తానని APIIC జైన్, మెగా సీడ్ పార్క్ లను సాక్షాత్తు ప్రారంభిస్తూ హామీ ఇచ్చారని అయితే ఆ హామీ ఇప్పుడు నెలకొల్పే పరిశ్రమలు అమలు చేయడం లేదని కనీసం ప్రజలకు తెలియకుండా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని ఇది న్యాయమా అని ఏపీఐఐసీ భూముల ఏర్పాటు చేస్తున్న అగ్రి క్రిస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కి అనుమతి ఉందా అని ఈ విషయంపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏం. రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. సోమవారం స్థానిక పిజిఆర్ఎస్ లో సీపీఐ ఆధ్వర్యంలో తాహసిల్దార్ కి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు సలీం, రాజు,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక వ్యవసాయ సంఘం చైర్మన్ గా దేశం సత్యనారాయణరెడ్డి ప్రమాణస్వీకారం.





**ఆంధ్ర ప్రగతి గడివేముల ఆగస్టు 18:** గడివేముల మండల ప్రాథమిక వ్యవసాయ సంఘం చైర్మన్ గా దేశం సత్య నారాయణ రెడ్డి ప్రమాణ స్వీకారం మరియు సొసైటీ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాణ్య%శీ% ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. ముందుగా మండల కేంద్రం లో ఎమ్మెల్యే కి క్రేన్ తో భారీ గజ మాలతో ఘన స్వాగతం పలికారు ,భారీ జనస%శీ%ద్రోహం తో సొసైటీ ఆఫీస్ వరకు ర్యాలీ గా బయదేరారు,అన%శీ%తరం నూతన సొసైటీ కార్యాలయం మరియు వ్యవసాయ గోడౌన్ ప్రారంభోత్సవం లను ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి,నూతన సొసైటీ చైర్మన్ మరియు డైరెక్టర్ ల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమం లో రాష్ట విశ్వ బ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్ కే పార్వతమ్మ,రాష్ట ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, మండల తహసీల్దార్, ఎంపిడిఓ,పలు శాఖల అధికారులు,మరియు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో మంత్రి నారా లోకేష్ కు ఘన సన్మానం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 18:** ఢిల్లీలో ఏపీ మంత్రి నారా లోకేష్సోమవారం కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, నితిన్ గడ్కరీ. హర్దీప్సింగ్, సోనావాల్, పీయూష్ గోయల్. జైశంకర్ లతో విడివిడిగా భేటీ అయ్యేందుకు వచ్చి తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయం సందర్శించారు. ఢిల్లీ కి వచ్చి పార్లమెంట్ ఆవరణలోని టీడీపీ ఎంపీ కార్యాలయంకు వచ్చిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను టీడీపీ, జనసేన ఎంపీలు ఘనంగా సత్కరించారు. ఏపీకి సంబంధించిన పలు ప్రతిపాదనలు కేంద్ర మంత్రులకు నారా లోకేష్ బృందం అందజేయనున్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్ కు కేంద్ర ప్రభుత్వం సకాలంలో నిధులు అందించి రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని కోరామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

# టీడీపీ ని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఇచ్చి అండగా ఉంటాం.





## - ఎన్ఎండి ఫిరోజ్.

**ఆంధ్ర ప్రగతి గోస్పాడు ఆగస్టు 18:** నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలంలోని యాళ్లూరు గ్రామం నందు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ అధ్యక్షులుగా గంగుల వెంకట రెడ్డి ప్రమాణస్వీకార మహెూత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తెలుగుదేశం పార్టీ నంద్యాల ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొనడంతో వారికీ యాళ్లూరు, జిల్లెల్ల, కృష్ణాపురం గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక యాళ్లూరు గ్రామంలోని సొసైటీ కన్వెన్షన్ హాల్ నందు జరిగిన సభలో గంగుల వెంకట రెడ్డి సొసైటీ అధ్యక్షులుగా బాధ్యతలను చేపట్టి మాట్లాడుతూ తనకు ఈ అవకాశం అందించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ కుటుంబానికి ఎప్పటికి రుణపడిఉంటానని తెలిపారు. యాళ్లూరు సొసైటీ ద్వార ఈ ప్రాంత రైతులకు నిత్యం అందుబాటులోనుంటూ వారికి సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ యాళ్లూరు సొసైటీ అధ్యక్షులు గంగుల వెంకటరెడ్డి కి కార్యవర్గ సభ్యులు ఖాదర్ భాష కి నారాయణ రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేశారు. గత ఎన్నికల్లో యాళ్లూరు గ్రామ పంచాయితీ నందు గ్రామ ప్రజలు తమ కుటుంబాన్ని ఆదరించి మెజారిటిని అందజేశారని గ్రామ ప్రజలందరికి ధన్యవాదములు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకలు అమలు చేస్తూ ప్రజల ఆదరణ పొందుతుందని, అన్న దాత సుఖీభవ ద్వార లక్షలాది రైతులకు ఏడాదికి 20,000 అందిస్తున్నామని అందులో మొదటి విడతగా 7,000జమ చేయడం జరిగిందన్నారు. గోస్పాడు మండలంలో నాయకులు కార్యకర్తలందరి సమిష్టి కృషితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక నాయకులు రైతులతో కలిసి సొసైటీ కార్యాలయం నందు నూతన జెనారేటర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోస్పాడు టీడీపీ కన్వీనర్ తులసిఈశ్వర్ రెడ్డి,టీడీపీ నాయకులు బాల ఈశ్వర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, వీర సింహారెడ్డి, ఖాదర్ భాష, నారాయణ రెడ్డి, హుస్సేనయ్య, మనోహర్ దూదేకుల హుస్సేని, విశ్వనాథ్ రెడ్డి సదాశివారెడ్డి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# శాంతిరాం మెడికల్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 18:** శాంతిరామ్ మెడికల్ కాలేజీలో స్ఫూర్తిదాయకంగా యాంటీ ర్యాగింగ్ వీక్ విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ర్యాగింగ్ కు దూరంగా ఉండాలని నంద్యాల తాలూకా సిఐ ఈశ్వరయ్య పిలుపు ఇచ్చారు. ర్యాగింగ్ వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి అవగాహన పెంచడానికి మరియు విద్యార్థులందరికీ సురక్షితమైన మరియు అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని పెంపొందించడానికి ర్యాగింగ్ వ్యతిరేక వారాన్ని శాంతిరామ్ మెడికల్ కళాశాల లో 18 వ తేదీ స్ఫూర్తి దాయకంగ నిర్వహించారు. శాంతిరాం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రాగింగ్ పై అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నంద్యాల తాలూకా సిఐ ఈశ్వరయ్య మాట్లాడుతూ ర్యాగింగ్ ఏ రూపంలోనైనా బాధితులపై తీవ్రమైన శారీరక మరియు మానసిక పరిణామాలను కలిగిస్తుంది. అందువల్ల, అందరు విద్యార్థులు రాగింగ్ భూతానికి దూరంగా ఉండాలని తెలిపారు. ఒక్కసారి ర్యాగింగ్ కేసులో ఇరుక్కుంటే విద్యార్థుల పేరు మీద కేసులు ఆన్ లైన్ నమోదు ఐతే ఉద్యోగాలు రావని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ వసంత్ చావన్ మాట్లాడుతూ శాంతిరామ్ విద్యా సంస్థల్లో రాగింగ్ పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. అలాగే కళాశాలలో ర్యాగింగ్ సంఘటన జరిగితే విద్యార్థులు ధైర్యంగా కాలేజీలో డిస్ప్లే చేసిన నెంబర్ లకు కాల్ చేయాలని, మీ నెంబరు సీక్రెట్ గా ఉంచి విచారణ జరుపుతామని అన్నారు. అనంతరం యాంటీ ర్యాగింగ్ వీక్ ముగింపు సందర్భంగా విద్యార్థుల తో కళాశాలలో ర్యాగింగ్ వద్దు అంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ




కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.శ్రీకాంత్, సర్జరీ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ %ఉ% హెచ్ ఓ డి మరియు చీఫ్ వార్డెన్ డాక్టర్ శ్రీహరి డిప్యూటీ హాస్టల్ వార్డెన్లు,డా. అంజలి వర్గీస డా క్టర్ నవీన్ కుమార్ డాక్టర్ ఎస్ శ్రీదేవి- మైక్రోబయాలజీ ప్రొఫెసర్, సైకియాట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా సీందూజా, పాల్గొన్నారు.

# ఈజీ లెర్న్ ఆఫ్టర్ ద స్కూల్ ట్యూషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఫిరోజ్.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ ఆగస్టు 18:** నంద్యాల పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ నందు నూతనంగా ఏర్పాటు చేసిన ఈజీ లేర్న్ ఆఫ్టర్ థ స్కూల్ ట్యూషన్ ఇన్స్టిట్యూట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ హాజరై తన చేతులా మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో చిన్నారులు విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారు మానసికంగా శారీరకంగా వెనుకబడిపోయి కేవలం



యంత్రాల్లా మారిపోతున్నారు. ఈ పరిస్థితిని గ్రహించి ఈజీ లెర్న్ వారు చిన్నారులను విద్య పరంగా అభివృద్ధి చేస్తూ వారి మెళుకువలను వెలికితీస్తూ విద్యను సులభతరం చేస్తూ ఏర్పాటు చేయడం మంచి విషయమని నంద్యాల ప్రజలు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈజీ లెర్న్ ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు శ్రీకంత్ నాయుడు,టీడీపీ నాయకులు కృపాకర్, తోట రామయ్య,షేక్ రఫీ అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో ఎన్నికల సంస్కరణలపై చర్చించాలి !

**ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి :**
బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వ్యవహారం రచ్చ కొనసాగుతోంది. నిజంగానే ఇందులో లోపాలు ఉంటే పరిశీలించి, పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉంది. అందుకు బీహార్ ఎన్నికల సంఘం వెంటనే కార్యాచరణకు దిగాల్సి ఉంది. ఎందుకంటే దేశంలో ఇన్నేళ్లయినా సమగ్ర ఓటు విధానం లేకుండా పోయింది. రాజకీయ నాయకులు ప్రమేయంతో మార్పులు, చేర్పులు చేయడం అలవాట య్యింది. వ్యవస్థీకృత లోపాలకు ఇన్నేళ్లు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీది ప్రధాన బాధ్యత. అలాగే దానిని కొనసాగిస్తున్న బిజెపిది కూడా. ఈ రెండు పార్టీల పాలనలో కేంద్ర ఎన్నికల సంఘం సర్వస్వతంత్రంగా పని చేయకుండా డమ్మీ పాత్రను పోషించేలా తయారయ్యింది. అలాగే గత పదేళ్లుగా అధికారం చెలాయిస్తున్న మోడీ కూడా ఎన్నికల సంఘాన్ని పటిష్టం చేయకుండా, మరింతగా దిగజారేలా చేస్తూ వచ్చారు. నిజానికి ఓటరు కార్డును పక్కాగా, పకడ్బందీగా రూపొందించడం పెద్ద పనికాదు. ఆధార్, పాన్ కార్డు తరహాలో పక్కాగా ఓటరు కార్డును రూపొందించవచ్చు. కానీ ఎన్నికల సంఘం ఈ తరహా ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే ఎన్నికల సంఘం తీరుపై కారాలు మిరియాలు నూరుతున్న రాహుల్ ఎందుకు ఎన్నికల సంస్కరణల పై మాట్లాడడం లేదు. ఎందుకు నిజాయితీగా వ్యవహరించడం లేదు. ఎందుకు పార్లమెంటులో చర్చకు దిగడం లేదు. కేవలం బీహార్ విషయమే గాకుండా మొత్తం ఎన్నికల సంస్కరణలపై మాట్లాడడం ద్వారా, విపక్షనేతగా తన సత్తా చాటుకోవాలి. అలా కాకుండా బీహార్ జాబితాను ముందేసుకుని మాట్లాడితే, ఆ రాష్ట్ర ఎన్నికలు ముగిసాక సమస్య మళ్లీ మొదటికే వస్తుంది. ఎన్నికల జాబితాలో ఎప్పుడు పడితే అప్పుడు ఇష్టం వచ్చినట్లు మార్పులు చేయడం, ఒకే ఇంటినూ వందల సంఖ్యలో ఓట్లు ఉండడం, ఒకే ఇంట్లో ఉన్నవారికి వేర్వేరు పోలింగ్ బూతుల్లో ఓటు కల్పించడం చూస్తున్నాం. నిజానికి దొంగ ఓట్ల సమస్య కూడా ఉంది. దొంగ ఓట్లు వేస్తే ఉరిశిక్ష విధించాలి. పార్టీ మారిన ఎమ్మెల్యేలు అర్హత కోల్పోయేలా చేయాలి. తెలంగానలో పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల విషయంలో సుప్రీం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, ఈ విషయంలో రాహుల్ ఎందుకు మాట్లాడడం లేదో చెప్పాలి. అందుకే ఎన్నికల సంస్కరణలపై రాహుల్ ముందు మాట్లాడాలి. ప్రతిపక్షనేతగా బాధ్యత తీసుకోవాలి. మోడీ సర్కార్‌ను నిలదీయడం కాదు. దేశ భవిష్యత్ కోసం బాధ్యతగల ప్రతిపక్ష నేతగా మాట్లాడాలి. పటిష్టమైన ఎన్నికల విధానం అమలు కావాలంటే సంస్కరణలు రావాలి. ఇందులో ఉన్న లోటుపాట్లకు సంబంధించి అన్ని విషయాల్లో చర్చ జరగాలి. ఈ పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరిగేలా రాహుల్ బాధ్యత తీసుకోవాలి. ఈ పని ఇన్నేళ్లుగా ఎందుకు చేయడం లేదన్నది గమనించాలి. ఇకపోతే ఒక్క శేషన్ కాలంలోనే ఎన్నికల సంఘం గట్టిగా పనిచేసింది. బీహార్ జాబితా వ్యవహారపై సవాల్ చేసిన పిటిషన్లపై విచారణలో భాగంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం భారత ఎన్నికల సంఘం రెండు ముఖ్యమైన ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్ల జాబితాను, తీసివేతకు కారణాలతో సహా ప్రచురించాలని తెలిపింది. ఆధార్ కార్డును ఒక ధ్రువీకరణ పత్రంగా



అంగీకరించాలని కూడా పేర్కొంది. 'సర్'ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ ఇంకా కొనసాగు తోంది. అయితే 'సర్'కు సంబంధించి, న్యాయసమీక్ష పరిధిలోకి రాని, అంశాలు అనేకం ఉన్నాయి. ప్రత్యేక సమగ్ర సవరణ లాంటి కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా నిర్వహించలేదు. జననమరణాలు సహజం. చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం సమర్థనీయమే. డబుల్ ఓట్లు ఉన్నా, పలు నియోజకవర్గాల్లో ఓటు ఉన్నా తొలగించాల్సిందే. అందుకు ప్రజలను కూడా బధ్యులు చేయాలి. అలాగే 18 సంవత్సరాల నిండిన యువతీ యువకుల పేర్లను ఓటర్ల జాబితాలో విధిగా చేర్చడం కూడా ముఖ్యమే. ఇకపోతే బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ తొలిదశను కేవలం 30 రోజులలో ఎందుకు పూర్తి చేశారన్న అనుమానాలు ఉన్నాయి. ప్రత్యేక సవరణలో 64 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితాను తొలగించినట్టు ఈసీఐ వెల్లడించింది. వీరిలో 22 లక్షల మంది 'మరణించి నట్టు', 7 లక్షల మంది పలు ప్రదేశాలలో ఓటర్లుగా నమోదు చేయించు కున్నారని, 36 లక్షల మంది బిహార్ నుంచి శాశ్వతంగా వలస పోయినవారు లేదా ఎటువంటి జాడ తెలియనివారు అని ఈసీఐ పేర్కొంది. నిజంగానే ఇది నిజమైతే సుప్రీం ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం వివరాలు ప్రకటించాలి. 36 లక్షల మంది బిహారీలు 'శాశ్వతంగా వేరే ప్రదేశాలకు వెళ్లిపోయారని' లేదా 'జాడ తెలియనివారు' అన్న నిర్ణయానికి ఎన్నికల సంఘం నిర్ణయించడానికి గల ఆధారాలు ఇవ్వాలి. కానీ ప్రస్తుత సవరణ తరవాత తాము ఓటు హక్కు కోల్పోతామేమోనని బిహార్‌లో లక్షలాది ఓటర్లు భయపడుతున్నారు. ఈ ఏడాది చివరలో జరగనున్న శాసనసభ ఎన్నికలలో తాము ఓటేసేందుకు లేకుండా పోయిందన్న భయంలో ఉన్నారు. నిజానికి ఇలాంటి చిన్నిచిన్న సమస్యలను కూడా పట్టించుకోకుండా ఎన్నికల సంఘం తన పనితీరును కొనసాగించడం సరికాదు. అందుకే ఎన్నికల సంఘం చట్టబద్ధమైన సంస్థగా వ్యవహరించడం లేదన్న విమర్శలు తరచూ వస్తున్నాయి. ఎవరికో ఒకరికి వత్తాసు పలికేందుకు ఎన్నికల సంఘం పనిచేయరాదు. జవాబుదారీ తనం ముఖ్యం. తాను రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థనని గుర్తించాల్సిందే. అలాగే తప్పులు జరిగినప్పుడు ఎన్నికలతో ప్రమేయమున్న ఓటర్లు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు జవాబుదారీగా కూడా ఉండాలి. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ పార్టీలు ఆరోపణలు చేసి, పార్లమెంట్‌ను బహిష్క రించడం సరికాదు. కేవలం వాయిదా తీర్మానంలోనే చర్చించాలన్న మూర్ఖపు వాదనా సరికాదు. బీహార్‌తో పాటు మొత్తం ఎన్నికల సంస్కరణలపైనే పెద్ద చర్చ జరగాల్సి ఉంది. దీనికి రాహుల లేదా ఇండియా కూటమి నేతలు సిద్ధం కావాలి. పార్లమెంటులో చర్చించడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. వాటి ద్వారా చర్చకు వెళ్లాలి. పార్లమెంట్ బహిష్కరణలు, ర్యాలీలు, విమర్శలు, ధర్నాలు,పాదయాత్రలు వంటివన్నీ పాతపద్ధతులు. ఇవన్నీ కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశించినవి మాత్రమే. పార్లమెంటులో చర్చ ద్వారా రాజ్యాంగ సవరణకు పూనుకోవాలి. మోడీ ప్రభుత్వంతప్పిదాలు ఉంటే నిలదీయండి. అలాగే గతంలో తమ పాలనకాలంలో జరిగిన తప్పులంటే క్షమాపణలు కోరండి.

# వర్షాలతో భారీగా నష్టపోయిన రైతులు

## రెండుసార్లు నాటుకున్నా తప్పని కష్టాలు

## ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలు

గుంటూరు,**ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి :** రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో 1.50 లక్షల ఎకరాల్లో వరి పైర్లకు నష్టం వాటిల్లగా ఇందులో గుంటూరు జిల్లాలో 70 వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి ఎన్యూమరేషన్ పక్రియ చేపట్టలేదు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రతి ఏటా పొలాలు ముంపునకు గురికావడం, రైతులు తీవ్ర నష్టాలపాలవడం పరిపాటిగా మారింది.ఈ నేపథ్యంలో రైతులు పంటను కోల్పోయి ఎటూ పాలుపోని స్థితిలో ఉన్నారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఈ ఏడాది అన్నదాతలకు ఆదిలోనే కష్టాలు ప్రారంభమయ్యాయి. వరిసాగు చేసిన రైతులు ఇప్పటి వరకు రెండుసార్లు వెదపద్ధతిలో విత్తనాలు చల్లగా ఒకసారి వర్షాభావం నష్టం వల్ల , రెండో విడత అతి భారీ వర్షాల కారణంగా పెట్టబుడులు దెబ్బతీశాయి. పంట ఎదుగుదల దశలో వైపరిరీత్యాల వల్ల ఎకరాకు ఒక్కో రైతు రూ.20 వేల వరకు నష్టపోయారు. ఈ నెల 12, 13 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షం వల్ల జిల్లాలోని దాదాపు లక్ష ఎకరాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ఇప్పటికే రెండుసార్లు నష్టపోయిన రైతులు మూడోసారి వెదపద్ధతిలో సాగుకు అవకాశాలు లేవని, ఇప్పుడు నాట్లు వేయాలన్నా నారు అందుబాటులో లేదని వాపోతున్నారు. నారుమడులు పోసి నారు తయారు కావాలన్న కనీసం 30 రోజులు సమయం పడుతుందని ఈ లోగా అదునుదాటిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో తొలి పంటగా వరి సాగు, రెండో పంటగా జొన్న, మొక్కజొన్న సాగు చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల పంటను ప్రాథమిక దశలోనే కోల్పోయారు. ప్రధానంగా తెనాలి డివిజన్‌లోని కొల్లిపర, దుగ్గిరాల, పెదకాకాని, మంగళగిరి, తాడేపల్లి, చేబ్రోలు, పొన్నూరు తదితర మండలాల్లో కురిసిన అధిక వర్షాలకు పైరు నీట మునిగి ఎందుకూ పనికిరాకుండాపోయింది. వరితో పాటు- కూరగాయలు, ఆకుకూరల తోటలు దెబ్బతిన్నాయి. పసుపు, కంద పంటలు నీట మునిగాయి. గుంటూరు ఛానల్‌కు గండ్లు పడడం, కొండవీటి వాగు ముంపు వల్ల అధిక నష్టం జరిగింది. కాల్వ కట్టల పటిష్టతపై అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్లే అధిక నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. మూడ్రోజులపాటు- పొలాల్లో రెండు అడుగుల మేరకు నీరు నిల్వ ఉండడం వల్ల పైర్లన్నీ దెబ్బతిన్నాయి. అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి. ఎకరాకు రూ.20 వేల వరకు ఒక్కో రైతుకు నష్టం వాటిల్లింది. కాల్వల మరమ్మతులు సక్రమంగా జరగపోవడం, పొలాల్లో నీరు బయటకు పోయే అవకాశాలు లేకపోవడం వల్ల పైర్లు నీట మునిగి పూర్తిగా నష్టం జరిగింది.

# ఎపి నుంచి తిరిగి వస్తున్న వాహనాలు

## విజయవాడ రహదారిపై ట్రాఫక్ జామ్

హైదరాబాద్,**ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి :**విజయవాడ-హైదరాబాద్ నేషనల్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. వీకెండ్ ముగియడంతో ప్రజలు తిరిగి పట్నం బాట పట్టారు. ఈ క్రమంలో ఏపీ నుంచి వేల సంఖ్యలో వాహనాలు హైదరాబాద్ వైపు వస్తుండడంతో విజయవాడ- హైదరాబాద్ హైవేపై, టోల్‌ఎ÷-లాజాల వద్ద వాహనాల రద్దీ పెరిగింది. చిట్యాల మండలం పెద్దకాపర్తి దగ్గర ÷-లఫైఓవర్ పనులు జరుగుతుండటంతో పెద్దకాపర్తి నుంచి చిట్యాల వరకు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో టోల్‌ఎ÷-లాజాల వద్ద మరిన్నీ బూత్‌లను ఓపెన్ చేశారు. హైవే పై భారీగా వాహనాల రద్దీ నెలకొనడంతో ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇందులోనే వర్షం కురుస్తుండటంతో వారి తిప్పలు మరింత ఎక్కువయ్యాయి.

# కోట శ్రీనివసారావు సతీమణ మృతి

హైదరాబాద్**ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి ::**దివంగత నటుడు కోట శ్రీనివాసరావు ఇంట మరో విషాదం నెలకొంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సతీమణి రుక్మిణి సోమవారం కన్నుమూశారు. కోట శ్రీనివాసరావు జులై 13న తుది శ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన ఇకలేరన్న వార్త మరువక ముందే కోట సతీమణి మృతి చెందడం కుటుంబ సభ్యులతో పాటు-, అందరినీ కలచివేస్తోంది. కోట నట జీవితంలో పడి కుటుంబాన్ని సరిగా పట్టించుకోలేకపోయానని అనేకసార్లు పంచుకున్నారు. షూటింగ్స్ ఉండి నెలకో, రెండు నెలలకో ఓసారి ఇంటికి వచ్చిన సందర్భాలు ఉన్నాయన్నారు. తన పిల్లలు చిన్నతనంలో అచ్చటా ముచ్చట పెద్దగా చూసుకుంది లేదని బాధపడ్డారు. ఇక పిల్లలు చదువుకుని బుద్ధిమంతులవడానికి తన సతీమణితో పాటు- ఇతర కుటు-ంబ సభ్యులే కారణమని తెలిపారు. కోట శ్రీనివాసరావుకు ఓర్పు ఎక్కువని, అందరితోనూ సరదాగా ఉంటారని రుక్మిణి ఓ సందర్భంలో పంచుకున్నారు.

# ప్రధాని మోడీతో శుభాంశు శుక్లా భేటీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి :**
అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం యాత్రను పూర్తి చేసుకుని స్వదేశానికి చేరుకున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ- అయ్యారు. ఈ సందర్భంగా శుభాంశు తన రోదసి ప్రయాణ విశేషాలను ప్రధాని తో పంచుకున్నారు. యాత్ర విజయవంతంపై మోదీ ఆయన్ను అభినందించారు. శుభాంశు శుక్లాతో సంభాషణ గొప్పగా సాగింది. అంతరిక్షంలో ఆయన అనుభవాలు, శాస్త్రసాంకేతిక రంగాల్లో పురోగతి, భారత్‌కు చెందిన ప్రతిష్మాత్మక 'గగన్‌యాన్' మిషన్ సహా అనేక అంశాలపై చర్చించాం. రోదసిలో శు భాంశు సాధించిన ఘనత పట్ల యావత్ దేశం గర్విస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.యాక్సియం-4 మిషన్‌లో భాగంగా జూన్ 25 నుంచి జులై 15 వరకు శుభాంశు శుక్లా తన బృందంతో కలిసి 'ఐఎస్ఎస్' యాత్ర నిర్వహించిన విషయం తెలిసిందే. దీని కోసం శిక్షణ పొందుతూ ఏడాదిగా ఆయన అమెరికాలో ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున భారత్‌కు తిరిగొచ్చారు. శుభాంశు అంతరిక్ష యాత్ర విజయవంతంపై లోక్‌సభలో ప్రత్యేకంగా చర్చించారు.


భారత్ సొంతంగా చేపట్టే అంతరిక్ష యాత్రలో 2040లో భారత వ్యోమగామి చంద్రుడిపై అడుగుపెట్టి త్రివర్ణ పతకాన్ని ఎగరవేసి వికసిత్ భారత్ ఖ్యాతిని చాటుతారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్



అన్నారు. ఈ మేరకు లోక్‌సభలో ప్రసంగించారు. శు భాంశు శుక్లా యాత్ర విజయవంతం కావడంతో పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. ఇందులో భాగంగా 2026లో మానవరహిత అంతరిక్ష యాత్ర చేపట్టడానికి భారత్ చర్యలు తీసుకుంటుందని.. 'వ్యోమిత్ర' అనే రోబోతో ఆ యాత్రను చేపట్ట బోతున్నామని వెల్లడించారు. ఆ తర్వాత 2027లో భారత్ నేతృత్వంలో తొలి మానవ అంతరిక్ష యాత్ర నిర్వహించనున్నట్లు- పేర్కొన్నారు. 2035కల్లా మనకూ సొంత అంతరిక్ష స్టేషన్ ఉంటుందన్నారు. 2040లో భారత వ్యోమగామి చంద్రునిపై సగర్వంగా భారత జెండా ఎగరేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 2014లో ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మోదీ అంతరిక్ష సంస్కరణలను చేపట్టారన్నారు. లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ భారత వ్యోమగామి శుక్లా గురించి ప్రసంగిస్తున్న సమయంలో
ప్రతిపక్షాలు బిహార్ ఓటరు జాబితాలో సవరణలను వ్యతిరేకిస్తూ..నినాదాలు చేశారు. శుక్లాపై ప్రసంగం పూర్తికాక ముందే సభ నుంచి వాకౌట్ చేయడం గమనార్హం. ప్రతిపక్షాల తీరును ఎన్డీఏ నేతలు తీవ్రంగా విమర్శించారు. దేశం అభివృద్ధి చెందడం, ముందుకు వెళ్లడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని అందుకే ఈ విధంగా ప్రవర్తిస్తారని..ఇది ఏమాత్రం అమోదయోగ్యం కాదని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ మాత్రం సోషల్ మీడియా వేదికగా శుక్లా ఘనతను ప్రశంసించారు. ఆయన అంతరిక్ష యాత్ర దేశానికి గర్వ కారణమని కొనియాడారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో(ఐఎస్ఎస్) ఆయన.. మానవాళికి ప్రయోజనం కలిగించే అనేక ప్రయోగాలను నిర్వహించారన్నారు. సమావేశం మధ్యలో విపక్ష ఎంపీలు నినాదాలు చేయడంపై స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. సభల్లో ప్రతిపక్ష నేతలు అర్థవంతమైన ప్రశ్నలు అడిగితే ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది కానీ ఇలా కాదని చురకలు అంటించారు. సభను మధ్యలో నిలిపివేసేలా నిరసనలు చేపట్టడం సరైన చర్య కాదన్నారు.

# జగన్‌కు బీజేపీ పెద్దల నుంచి ఫోన్!

**ఆగస్టు 18 ఆంధ్ర ప్రగతి :**
ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి కేంద్రంలో చక్రం తిప్పే అవకాశం వచ్చిందా? రాష్ట్రంలో ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్ కు బీజేపీ పెద్దల నుంచి ఫోన్ ఎందుకు వచ్చింది? పొలిటికల్ సర్కిల్స్ లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. వైసీపీ అధినేత జగన్ కు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఫోన్ చేశారని విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా బీజేపీకి మద్దతు ఇవ్వాలని రాజ్ నాథ్ సింగ్ మాజీ సీఎంను కోరినట్లు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం రాత్రి ఢిల్లీ వెళ్ల నుండగా, ఆయన ప్రయాణ సన్నాహాల్లో ఉన్న సమయంలో జగన్ కు కేంద్ర బీజేపీ పెద్దల నుంచి ఫోన్ రావడం ఆసక్తికర చర్చకు తెరలేపింది. అసలు నిజం తెలిస్తే షాక్ అవ్వాల్సిందే.. ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధకృష్ణణ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. సెప్టెంబరు 9న జరిగే ఎన్నిక జరగనుండగా, బీజేపీ పార్లమెంటరీ బోర్డులో సీపీ రాధకృష్ణణ్ పేరును ప్రతిపాదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సోమవారం రాత్రి జరిగే ఎన్డీఏ పక్షాల సమావేశంలో ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధకృష్ణణ్ పేరు ఆమోదించడం లాంఛనంగానే చెబుతున్నారు. మంగళవారం ఎన్డీఏ పక్షాల నేతలు, ఎన్డీఏ పార్టీల ముఖ్యమంత్రులు, ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో సీపీ రాధకృష్ణణ్ ఉప రాష్ట్రపతి పదవికి నామినేషన్ వేయనున్నారు. ఉప రాష్ట్రపతిని



ఎన్నుకునే ఎలక్టోరల్ కాలేజీలో ఎన్డీఏకు సంపూర్ణ ఆధిక్యం ఉంది. సీపీ రాధకృష్ణణ్ సెప్టెంబరు 9న జరిగే ఎన్నికల్లో గెలవడం లాంఛనమే అని చెబుతున్నారు. కానీ, ఎన్నికను ఏకగ్రీవం చేయాలనే ఆలోచనతో ఉన్న ప్రధాని మోదీ ప్రతిపక్షాలతో మాట్లాడాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగుకు బాధ్యతలు అప్పగించారు. 95 సీఎంలో ఈ సడన్ ఛేంజ్ దేనికి! కేంద్రంలో ఎన్డీఏతోపాటు ఇండి కూటమి మధ్య నువ్వా-నేనా అన్నట్లు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు నెలకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఏకగ్రీవంగా ఎన్నుకోవాలనే ప్రతిపాదన ఆసక్తికరంగా మారింది. ఇండి కూటమి పోటీ చేసినా, ఎన్డీఏ బలపరిచిన సీపీ రాధకృష్ణణ్ ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కానీ, ఎన్నిక ఏకగ్రీవం చేసి ఉప రాష్ట్రపతి పదవికి ప్రతిష్ఠ తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. దీంతో ప్రతిపక్షాలతోపాటు కేంద్రంలో తటస్థంగా ఉన్న పార్టీలతోనూ సంప్రదింపులు మొదలుపెట్టింది. ముందుగా తటస్థంగా ఉన్నవారి మద్దతు కూడగట్టాలనే ఆలోచనతో వైసీపీ అధినేత జగన్ తో కేంద్ర మంత్రి రాజనాథ్ సింగు మాట్లాడారని చెబుతున్నారు. ప్రస్తుతం వైసీపీకి నలుగురు ఎంపీలు, ఏడుగురు రాజ్యసభ సభ్యుల బలం ఉంది. వైసీపీ ప్రస్తుతం కేంద్రంలో ఎన్డీఏ, ఇండి కూటములకు సమదూరం పాటిస్తోంది. అయితే ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో బీజేపీకి అనుకూలంగానే వ్యవహరించేలా పలు నిర్ణయాలు తీసుకునేది. కానీ, ఎప్పుడూ ఎన్డీఏ కూటమిలో చేరేందుకు ఆసక్తి చూపలేదు. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలో టీడీపీతో జట్టుకట్టి వైసీపీని ఓడించింది. ఈ పరిస్థితుల్లో జగన్ నిర్ణయం ఉత్కంఠ రేపుతోంది. కేంద్ర సర్కారులోని బీజేపీ అండదండలతోనే టీడీపీ కూటమి గెలువగలిగిందని అనుమానిస్తున్న మాజీ సీఎం జగన్.. బీజేపీపై కొంత అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో ఇండి కూటమితో కూడా జగన్ కు సఖ్యత కుదరలేదు. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో హాట్ లైన్ చర్చల్లో ఉన్నారని విమర్శించిన జగన్ పరోక్షంగా తన వైఖరిని వెల్లడించారని అంటున్నారు.

# టీంకు కోచ్ మంచి గైడెన్స్ ఇచ్చాడు

## ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్ వెల్లడి



గత సంవత్సరం జులైలో టీమ్ ఇండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ సెలక్ట్ అయ్యాడు. అప్పటి నుంచి టెస్ట్ క్రికెట్‌లో భారత్ పెద్దగా విజయాలు సాధించలేదు. టీమ్ సెలక్షన్, స్ట్రాటజీల విషయంలో గంభీర్ ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నాడు. నాలుగు టెస్ట్ సిరీస్‌లలో ఒకే ఒక్క గెలుపు దక్కింది. స్పెషలిస్ట్ ప్లేయర్స్ కంటే ఆల్ రౌండర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం, కీలక బౌలర్లపైనే అతిగా ఆధారపడటం వంటి నిర్ణయాలతో విమర్శలు ఎదుర్కొన్నాడు. ఈ ఛాలెంజెస్ ఉన్నప్పటికీ గంభీర్ మ్యాన్ మేనేజ్‌మెంట్‌లో మాత్రం హైలెట్ అయ్యాడు. యంగ్ ప్లేయర్లను ఇన్‌స్పైర్ చెయ్యడంలో, వారిలోని బెస్ట్‌ని బయటకు తీసుకురావడంలో సక్సెస్ అయ్యాడు. టాప్, సీనియర్ ప్లేయర్లు రోహిత్, కోహ్లీ రిటైర్ అయ్యాక యంగ్ టీమ్ ఇండియాకి కోచ్ మంచి గైడెన్స్ ఇచ్చాడని ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్‌లేటెస్ట్ ఇంటర్వ్యూలో చెప్పాడు.ప్రస్తుతం ఇండియా టీమ్ ట్రాన్సిషన్ ఫేజ్‌లో ఉంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ ప్లేయర్లు రిటైర్మెంట్ ఇచ్చేశారు. మహ్మద్ షమీ, జస్‌ప్రీత్ బుమ్రా వంటి కీలక బౌలర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం లేదు. ఇప్పుడున్న టీమ్‌కి మరీ ఎక్కువ ఎక్స్‌పీరియన్స్ లేదు. కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ మాత్రమే ఎక్స్‌పీరియన్స్‌డ్ బ్యాట్స్‌మెన్‌గా ఉన్నారు. బుమ్రా, సిరాజ్ బౌలింగ్ డిపార్ట్‌మెంట్‌ను లీడ్ చేస్తున్నారు. చాలామంది ప్లేయర్లు అరంగేట్రం లేదా లాంగ్ గ్యాప్ తర్వాత తిరిగి వచ్చినవారే. టీమ్ టఫ్ స్పాట్‌లో ఉంది. ఇలాంటి టైమ్‌లో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ యంగ్ టీమ్‌ను సక్సెస్‌ఫుల్‌గా నడిపిస్తున్నాడని ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్ 'రెవ్‌స్పోర్ట్జ్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాడు. గంభీర్ స్ట్రెంత్ ప్లేయర్స్‌ని మోటివేట్ చేయడంలో ఉందని, అతడు టీమ్ ఇండియాకి ప్రాతినిధ్యం వహించడం గౌరవమని శార్దూల్ చెప్పాడు. యంగ్‌స్టర్స్ టాలెంట్‌పై నమ్మకం ఉంచాడని, టీమ్ మీటింగ్స్‌లో గంభీర్ చెప్పిన మాటలను శార్దూల్ గుర్తుచేసుకున్నాడు. 'దేశానికి ఆడటం మీ అదృష్టం. మీకు నమ్మకం ఉంటే, మీరు ఓడించలేని ప్రత్యర్థి లేదు. ఇది మీ రోజు అయితే, మీరు ఎంతగా కోరుకుంటే, అంతగా విజయం సాధిస్తారు.' అని గంభీర్ చెప్పాడని వివరించాడు.హెడ్ కోచ్ మోటివేషన్‌తో, ఈ మైండ్‌సెట్ ప్లేయర్స్‌లో కనిపించింది. వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, ఆకాష్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి యంగ్ ప్లేయర్స్ గంభీర్ గైడెన్స్‌లో డెవలప్ అయ్యారు. ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో ఇబ్బంది పడిన శార్దూల్ కూడా గంభీర్ తన కాన్ఫిడెన్స్‌ని బూస్ట్ చేశాడని చెప్పాడు. యంగ్ ప్లేయర్స్‌లోని ఎనర్జీని యూజ్ చేసుకోవడం గంభీర్ విధానం. మోడర్న్ క్రికెట్‌లో, కోచ్ పాత్ర టెక్నికల్ ఛేంజెస్ కంటే, నమ్మకాన్ని పెంపొందించడంలోనే ఎక్కువగా ఉంటుందని గంభీర్ అర్థం చేసుకున్నాడు. తమను తాము నిరూపించుకోవడానికి ఆసక్తిగా ఉన్న యంగ్ ప్లేయర్స్‌కి గైడెన్స్ ఇచ్చాడు. 'యంగ్ ప్లేయర్స్ జట్టులో ఉన్నప్పుడు, వారు ప్రపంచం ముందు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఏదైనా చేస్తారు. అదే టీమ్ ధైర్యాన్ని పెంచింది. మా జట్టును ముందుకు నడిపించింది' అని శార్దూల్ వివరించాడు.

# ఆసియా కప్‌లో భారత్‌ను ఓడిస్తాం



## పీసీబీ చీఫ్ సెలెక్టర్ ఆకిబ్ జావేద్

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు 2025 ఆసియా కప్ కోసం 17 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఈ సందర్భంగా కొన్ని గట్టి నిర్ణయాలు తీసుకుంది. జట్టు ఎంపికలో ఆశ్చర్యకరంగా బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్, నసీమ్ షా వంటి ప్రముఖ ఆటగాళ్లను సెలెక్టర్లు పక్కన పెట్టారు. పీసీబీ చీఫ్ సెలెక్టర్ ఆకిబ్ జావేద్ ఈ జట్టు సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని భారత జట్టును ఓడించే సామర్థ్యం కలిగి ఉందని ధీమాగా ఉన్నారు. ఇటీవలి పేలవమైన ప్రదర్శనలు ఉన్నప్పటికీ, ఈ జట్టు ఆసియా కప్‌లో భారత్‌ను ఓడించగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. "భారత్‌తో మ్యాచ్‌లు ఎప్పుడూ ఉత్కంఠభరితంగా ఉంటాయి. ఈ 17 మంది సభ్యుల జట్టు ఏ జట్టునైనా ఓడించే సత్తా కలిగి ఉంది. మనం వారిపై ఒత్తిడి చేయకూడదు, కానీ నాకు ఈ జట్టు మీద పూర్తి నమ్మకం ఉంది," అని జావేద్ అన్నారు. యువ ఆటగాళ్లపై నమ్మకం ఉంచి, బాబర్ ఆజం వంటి సీనియర్ ఆటగాళ్లను తప్పించింది. పాకిస్తాన్ సూపర్ లీగ్ ఆటగాళ్ల ఎంపికలో కీలక పాత్ర పోషించిందని జావేద్ తెలిపారు. "మేము సీనియర్ ఆటగాళ్లను పూర్తిగా విస్మరించడం లేదు. ప్రస్తుత ఎంపిక ఆటగాళ్ల అభివృద్ధిని బట్టి జరిగింది. సాహిబ్‌జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, మరియు ఫఖర్ జమాన్‌లను ఉదాహరణలుగా చెప్పవచ్చు. సాహిబ్‌జాదా తిరిగి రాగలిగాడు, సైమ్ కూడా ప్రారంభంలో ఇబ్బంది పడినా తర్వాత రాణించాడు," అని జావేద్ వివరించారు. ఆయన మరింత మాట్లాడుతూ, "ఆటగాడి కెరీర్‌ను ఒక్కసారిగా ముగించలేం. అవకాశాలు ఎల్లప్పుడూ ఉంటాయి. ప్రస్తుతం కొందరు ఆటగాళ్లు , బిగ్ బాష్ లీగ్ వంటి టోర్నమెంట్లలో అనుభవం సంపాదిస్తున్నారు. ఎవరు మెరుగైన ప్రదర్శన చేస్తారో, వారే జట్టులో చోటు దక్కించుకుంటారు," అని జావేద్ స్పష్టం చేశారు. బాబర్ ఆజం జట్టులో చేరని విషయంపై మాట్లాడుతూ, జావేద్ ఇలా అన్నారు: "బాబర్ స్పిన్‌ను ఎదుర్కోవడంలో మరియు స్ట్రైక్ రేట్‌లో కొన్ని అంశాల్లో మెరుగుపడాలని మేము సూచించాము. అతను దానిపై కఠినంగా పని చేస్తున్నాడు. బాబర్ వంటి ఆటగాడు బిగ్ బాష్ లీగ్‌లో ఆడి, టీ20 ఫార్మాట్‌లో మెరుగైన ప్రదర్శన చేయగలడని నమ్ముతున్నాము. అతను అద్భుతమైన ఆటగాడు, అతన్ని విస్మరించడం అసాధ్యం." అని జావెద్ పేర్కొన్నాడు. పాకిస్తాన్ క్రికెట్ జట్టు : సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్ , ఫహీమ్ అష్రఫ్, ఫకర్ జమాన్, హారీస్ రౌఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ తలత్, ఖుష్దిల్ షా, మహ్మద్ హారీస్ (వికెట్ కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ వసీమ్ జూనియర్, సాహిబ్‌జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, సల్మాన్ మీర్జా, షాహీన్ షా అఫ్రిది, సుఫ్యాన్ మొకిమ్

# టీమ్ఇండియా మ్యాచ్‌లకు ఫుల్ డిమాండ్

2025 ఆసియా కప్‌పైనే ప్రస్తుతం క్రీడా వర్గాల్లో చర్చ జరుగుతోంది. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9న ఈ టోర్నీ ప్రారంభం కానుంది. టీమ్ఇండియా హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. సెప్టెంబర్ 10న యూఏఈతో భారత్ తొలి మ్యాచ్ ఆడనుంది. టీ20 ఫార్మాట్లో జరగనున్న ఈ టోర్నీ కోసం క్రికెట్ ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా భారత్ మ్యాచ్‌లకు అత్యంత ఆదరణ దక్కనుంది.2031 వరకు ఆసియా కప్ ప్రసార హక్కులను, ప్రముఖ స్పోర్ట్స్ నెట్‌వర్క్ సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా 170 మిలియన్ డాలర్లకు సొంతం చేసుకుంది. దీంతో ఈ టోర్నమెంట్ మ్యాచ్‌లన్నీ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో టెలికాస్ట్ కానున్నాయి. ఇక డిజిటల్‌లో సోనీస్పోర్ట్స్ లో లైవ్ స్ట్రీమింగ్ కానుంది. ఈ క్రమంలో టోర్నీ గురించి ఓ ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ ఆసియా కప్‌లోని మ్యాచ్‌లకు కోట్లలో వ్యూస్ రావడం పక్కా. టీమ్ఇండియా లీగ్, సూపర్ 4తో కలిపి ఆరు మ్యాచ్‌లు ఆడే ఛాన్స్ ఉంది. అందుకే ప్రసారకర్తగా వ్యవహరిస్తున్న సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ భారత్ మ్యాచ్‌లతో భారీ ఆదాయం సమకూర్చుకునే ప్లాన్ చేస్తుందట! ఈ నేపథ్యంలోనే టీమ్ఇండియా మ్యాచ్‌లకు అడ్వర్టైజ్‌మెంట్‌కు భారీ రేటు నిర్ణయించినట్లు తెలుస్తోంది. 10 సెకన్ల యాడ్‌కు రూ.14 నుంచి రూ.16 లక్షలుగా ధర నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఇందులో భారత్- పాకిస్థాన్ మ్యాచ్ కూడా ఉండడం మరో హైలైట్.ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 14న భారత్- పాకస్థాన్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. అలాగే సూపర్ 4లోనూ ఈ రెండు జట్లు తలపడే అవకాశాలు ఉన్నాయి. అయితే ఇటీవల ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాక్‌తో మ్యాచ్ ఆడేందుకు టీమ్ఇండియా లెజెండ్స్ జట్టు నిరాకరించింది. ఈ మ్యాచ్‌ను బాయ్‌కట్ చేసింది. దీంతో ఈ టోర్నీలో భారత్- పాక్ మ్యాచ్‌పై సస్పెన్స్ కొనసాగుతోంది. కానీ, ఒకవేళ ఈ హై వోల్టేజ్ మ్యాచ్ ఉంటే మాత్రం, ప్రసారకర్తలకు భారీ ప్రయోజనం చేకూరుతుంది. క్రికెట్‌లో భారత్ - పాక్ మధ్య జరిగే మ్యాచ్‌లకు భారీ రెస్పాన్స్ ఉంటుంది. 2023 ఆసియా కప్‌లో పాక్- భారత్ మ్యాచ్‌ను డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ఓ సమయంలో 2.8 కోట్ల వ్యూస్ వచ్చాయి. క్రికెట్ మ్యాచ్‌కు అత్యధికి వ్యూస్ వచ్చిన అదికొద్ది మ్యాచ్‌ల్లో ఇది ఒకటి. ఈ క్రమంలోనే ఈసారి కూడా పాత రికార్డులు బద్దలయ్యే ఛాన్స్ ఉంది.

# మా నాన్నకి క్రికెట్ అంటే అపారమైన ఇష్టం

## శుభ్‌మన్ గిల్ కీలక వ్యాఖ్యలు



అన్ని ఫార్మాట్లకూ సరిపోయే ఆటతీరుతో, సవాళ్లను దాటే ధైర్యంతో, అలరించే షాట్లతో 'విరాట్ తర్వాత ఎవరు' అనే ప్రశ్నకు తానే సమాధానం చెబుతున్నాడు ఈ పంజాబీ యువ సంచలనం శుభ్‌మన్ గిల్. తాజాగా ఇంగ్లాండ్‌పై జరిగిన టెస్టు సిరీస్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో పాటు కెప్టెన్‌గా కూడా అదరగొట్టాడు. తన ప్రయాణం, తన కలల గురించి చెప్పుకున్న ముచ్చట్లు ఇవే.'మా నాన్నకి క్రికెట్ అంటే అపారమైన ఇష్టం. నిజానికి ఆయనకే క్రికెటర్ కావాలనేది కల. కానీ కుటుంబ పరిస్థితుల కారణంగా సాధ్యం కాలేదు. ఆ కలను నా ద్వారా నెరవేర్చుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఒకసారి మ్యాచ్ చూసేందుకు నేను నాన్నతో కలిసి మొహాలీ వెళ్లాను. అక్కడి స్టేడియం వాతావరణం చూసిన తర్వాత, 'నా బిడ్డ ఇక్కడే క్రికెట్ నేర్చుకోవాలి' అని అనుకున్నారు నాన్న. ఆ తర్వాత మేమంతా మొహాలీకి మారిపోయాం 'చదువుకుంటూనే మొహాలీ క్రికెట్ అసోసియేషన్ అకాడమీలో చేరాను. ప్రతి రోజు ఉదయం నాలుగు గంటలకు లేచి అకాడమీకి వెళ్లేవాడిని. రెండు గంటల ప్రాక్టీస్ చేసి స్కూల్‌కి వెళ్ళేవాడిని. స్కూల్ నుంచి వచ్చాక మధ్యాహ్నం నాన్న పర్యవేక్షణలో ఒక గంట సాయంత్రం మళ్లీ మూడు గంటలు అకాడమీలో కఠినమైన ప్రాక్టీస్ చేసేవాడిని. అదే నా ఆటతీరుకు పునాది"నా ఆట ఎప్పుడూ నాకంటే పెద్దవాళ్లతోనే ప్రారంభమైంది. పదకొండేళ్లకే అండర్%-%16 జట్టులోకి పదహారేళ్లకే అండర్%-%19 జట్టులోకి ఎంపికయ్యా. ఈ ప్రయాణం నాకు కొత్త సవాళు విసిరింది అదే నన్ను మెంటల్‌గా, టెక్నికల్‌గా తీర్చిదిద్దింది''2018లో జరిగిన అండర్%-%19 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచాను. అదే నా కెరీర్‌కి టర్నింగ్ పాయింట్. అప్పుడే ఐపీఎల్ వేలం జరగ్గా కోల్‌కతా జట్టు నన్ను రూ.1.8 కోట్లకు కొనుగోలు చేసింది' 'ఆ తర్వాత 2019లో భారత్ వన్డే జట్టులోకి ఎంపికయ్యా. 2020 చివర్లో టెస్టుల్లో కూడా నా డెబ్యూ జరిగింది. అలా ఒక్కో మెట్టుగా నా క్రికెట్ ప్రయాణం ముందుకు సాగింది' 'గెలుపులో మాకంటే ఎక్కువ సంతోషపడేది. ఓటమిలో మాకంటే ఎక్కువ బాధపడేది మా అమ్మే. ఆమె రియాక్షన్ చూసి నాకు ఆటలో మోటివేషన్ రెట్టింపవుతుంది. ఇక మా అక్క సంగతి వేరే. ఆమె నా బెస్ట్ ఫ్రెండ్. నా సీక్రెట్స్ అన్నీ ఆమెకే తెలుసు. 'సాధారణంగా ఆటగాళ్లంతా సింగిల్ డిజిట్ జెర్సీ నంబర్స్ కోరుకుంటారు. కానీ నాకు మాత్రం డబుల్ డిజిట్ 77 వచ్చింది. అయితే సారథిగా నా తొలి టెస్టులోనే మెరుగైన ప్రదర్శన ఇవ్వగానే అందరికీ నా సామర్థ్యంపై నమ్మకం పెరిగింది. ఇక దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ - వాళ్లిద్దరి నైపుణ్యాలు నాలో ఉన్నాయని చెబుతుండటం నాకు మరింత బలాన్నిచ్చింది. అది నాకు మోటివేషన్ కూడా అయిందని అన్నారు.

# పేలవ ఫామ్ కారణంగానే బాబర్ ఆజామ్‌ను తప్పించాం

ఆసియా కప్ 2025 కోసం ఎంపిక చేసిన పాకిస్థాన్ జట్టులో సీనియర్ ఆటగాళ్లు అయిన బాబర్ ఆజామ్, మహమ్మద్ రిజ్వాన్‌లకు చోటు దక్కలేదు. 17 మంది సభ్యులతో కూడిన పాకిస్థాన్ జట్టును ఆదేశ సెలెక్టర్లు ఆదివారం ప్రకటించారు. బాబర్ ఆజామ్, మహమ్మద్ రిజ్వాన్‌లతో పాటు నసీమ్ షాకు కూడా చోటు దక్కలేదు. ఆల్‌రౌండర్ సల్మాన్ అలీ అఘా సారథ్యంలో పాకిస్థాన్ ఆసియా కప్ 2025 బరిలోకి దిగుతోంది. సెప్టెంబర్ 9 నుంచి యూఈఏ వేదికగా టీ20 ఫార్మాట్‌లో ఆసియా కప్ 2025 ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ 14న చిరకాల ప్రత్యర్థులైన భారత్, పాకిస్థాన్ మధ్య హైఓల్టేజ్ మ్యాచ్ జరగనుంది. బాబర్ ఆజామ్, మహమ్మద్ రిజ్వాన్‌పై వేటు వేయడం ఆ దేశ అభిమానులతో పాటు యావత్ క్రికెట్ ప్రపంచాన్ని షాక్‌కు గురి చేసింది. బాబర్ ఆజామ్ గతేడాదిగా ఒక్క టీ20 మ్యాచ్ ఆడలేదు. బాబర్ ఆజామ్‌ను తప్పించడానికి గల కారణాన్ని ఆ జట్టు వైట్ బాల్ ఫార్మాట్ హెడ్ కోచ్ మైక్ హెస్సెన్ తెలిపాడు. జిడ్డు బ్యాటింగ్‌తో పాటు పేలవ ఫామ్ కారణంగానే బాబర్ ఆజామ్‌ను తప్పించినట్లు పేర్కొన్నాడు. బాబర్ ఆజామ్ అద్భుతమైన ఆటగాడు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. కానీ తన బ్యాటింగ్‌లో చాలా లోపాలు ఉన్నాయి. వాటిని సరిచేసుకోవాల్సిన అవసరం బాబర్ ఆజామ్‌కు ఉంది. ముఖ్యంగా స్పిన్ బౌలర్లను ఎదుర్కోవడంలో బాబర్ ఆజామ్ తడబడుతున్నాడు. అంతేకాకుండా అతని స్ట్రైక్‌రేట్ కూడా చాలా తక్కువగా ఉంది. టీ20ల్లో స్ట్రైక్ రేట్ చాలా కీలకం. అతను చాలా మెరుగ్వాలి. కఠినంగా ట్రైన్ అవ్వాలి. అతను కూడా బ్యాటింగ్‌ను మెరుగుపర్చుకోవడంపై ఫోకస్ పెట్టాడు.ఆస్ట్రేలియా వేదికగా జరిగే బిగ్ బాష్ లీగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాడు. ఆ టోర్నీ అతని ఆట మెరుగుపడేందుకు సహాయపడుతుంది. ఆసియా కప్‌కు ఎంపికైన పాకిస్థాన్ జట్టులో మెరుగైన ప్రదర్శన చేసే ఆటగాళ్లు ఉన్నారు. ముఖ్యంగా ఫర్హాన్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. గత మూడు మ్యాచ్‌ల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. టీ20ల్లో విజయం సాధించాలంటే రన్ రేట్ కీలకం. భారీ లక్ష్యాన్ని నమోదు చేస్తేనే మ్యాచ్ గెలవగలం'అని మైక్ హెస్సేన్ చెప్పుకొచ్చారు.



# భువనేశ్వర్ కుమార్‌ను ఎంపిక చేయండి

## టీమిండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్



ఆసియా కప్ 2025 బరిలోకి దిగే భారత జట్టును మంగళవారం ప్రకటించే అవకాశం ఉంది. సెప్టెంబర్ 9 నుంచి యూఏఈ వేదికగా టీ20 ఫార్మాట్‌లో ఈ టోర్నీ జరగనుంది. ఈ టోర్నీ కోసం భారత జట్టు ఎంపికపై అజిత్ అగార్కర్ సారథ్యంలోని భారత సెలెక్షన్ కమిటీ కసరత్తులు చేస్తోంది. టీమిండియా స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేకపోవడంతో ఏ ఆటగాళ్లకు అవకాశం దక్కుతుందా అనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.జస్‌పీత్ బుమ్రా, శుభ్‌మన్ గిల్‌లను ఎంపిక చేయాలని కొందరంటే.. మరికొందరు వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్ నేపథ్యంలో విశ్రాంతి ఇవ్వాలని కామెంట్ చేస్తున్నారు. ఐపీఎల్‌లో సత్తా చాటిన శ్రేయస్ అయ్యర్, సాయి సుదర్శన్‌లను ఎంపిక చేయాలని మరికొందరు కోరుతున్నారు. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్.. భువనేశ్వర్ కుమార్‌ను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భువనేశ్వర్ కుమార్ మెరుగైన ప్రదర్శన చేశాడని గుర్తు చేశాడు.'ఆసియా కప్ జట్టులోకి భువనేశ్వర్ కుమార్ తీసుకోవాలి. ఎందుకంటే అతను అద్భుతంగా రాణిస్తున్నాడు. టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో అతని విఫలమైనప్పటికీ అంతకు ముందు తర్వాత మెరుగ్గా రాణించాడు. ఆ సెమీఫైనల్ తర్వాత భువనేశ్వర్ కుమార్ మళ్లీ టీమిండియాకు ఆడలేదు. కానీ ఐపీఎల్‌లో మెరుగైన ప్రదర్శన చేశాడు. సెలెక్టర్లు అతన్ని ఎందుకు పట్టించుకోవడం లేదో నాకు అర్థం కావడం లేదు. కొత్త బంతితో భువీ అద్భుతంగా బౌలింగ్ చేయగలడు. అతని బౌలింగ్‌ను సీరియస్‌గా చూడాలి. అప్పుడే అతని సామర్థ్యం అర్థమవుతుంది.'అని శ్రీకాంత్ చెప్పుకొచ్చారు.టీ20 ప్రపంచకప్ 2022 సెమీఫైనల్లో చివరిసారిగా భారత్ తరఫున ఆడిన భువనేశ్వర్ కుమార్..ఇప్పటి వరకు 87 మ్యాచ్‌ల్లో 6.96 ఎకానమీతో 90 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీ తరఫున 14 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు పడగొట్టాడు. పంజాబ్ కింగ్స్ తరఫున జరిగిన ఫైనల్లో 38 పరుగులిచ్చి రెండు కీలకమైన వికెట్లు తీసాడు. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో 190 మ్యాచ్‌లు ఆడి 198 వికెట్లు తీసాడు. అతని రికార్డ్స్‌ను గుర్తు చేసిన క్రిష్ శ్రీకాంత్.. భారత జట్టులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆసియా కప్ 2025లో ప్రసిధ్ కృష్ణ కంటే సిరాజ్‌కే చోటు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని శ్రీకాంత్ అన్నారు. 'జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ఖచ్చితంగా జట్టులో ఉంటారు. మూడో పేసర్‌గా ప్రసిధ్ కృష్ణ కంటే సిరాజ్‌కే చోటు దక్కుతుందనేది నా నమ్మకం. సిరాజ్‌కు పోరాడే తత్వం ఉంది. ప్రసిధ్ ఐపీఎల్‌లో అద్భుతంగా బౌలింగ్ చేశాడు. కానీ అదనపు మీడియం పేసర్‌గా సిరాజ్‌ను తీసుకోవాలి. ప్రస్తుతం సిరాజ్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. నేనైతే సిరాజ్‌నే ఎంచుకుంటా.'అని శ్రీకాంత్ చెప్పుకొచ్చారు.



## ప్రేయసితో సీక్రెట్‌గా ఎంగేజ్‌మెంట్ చేసుకున్న సింగర్ రాహుల్ సిప్లిగంజ్

బిగ్ బాస్ సీజన్ 3 విన్నర్, ఆర్ఆర్ఆర్‌లోని 'నాటు నాటు' పాటతో ఆస్కార్ విజేతగా నిలిచిన రాహుల్ సిప్లిగంజ్ తన ప్రేయసి హరిణి రెడ్డితో నిశ్చితార్థం చేసుకున్నాడు. ప్రస్తుతం వీరి ఎంగేజ్‌మెంట్ తాలూకు ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. నిన్న వీరి ఎంగేజ్‌మెంట్ హైదరాబాద్‌లో కొంతమంది అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగినట్టు సమాచారం. అయితే, రాహుల్ సిప్లిగంజ్ ప్రతి చిన్న విషయాన్ని కూడా అభిమానులతో షేర్ చేసుకుంటూ ఉంటాడు. కానీ, తన జీవితంలో ఇంత ముఖ్యమైన వేడుకను మాత్రం చాలా సీక్రెట్‌గానే ఉంచడం హాట్ టాపిక్‌గా మారింది. రాహుల్ కానీ, అతని కుటుంబ సభ్యులెవరూ కూడా ఈ ఎంగేజ్‌మెంట్ ఫొటోలను అధికారికంగా విడుదల చేయలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం బాగా వైరల్‌గా మారాయి. దీంతో పలువురు అభిమానులు, నెటిజన్లు రాహుల్ సిప్లిగంజ్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.కాగా, రాహుల్‌కు కాబోయే అర్ధాంగి హరిణి రెడ్డి గురించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. నిశ్చితార్థం సందర్భంగా రాహుల్– హరిణి రెడ్డి కలర్ ఫుల్ డ్రెస్సుల్లో మెరిసిపోయారు. మొత్తానికి ఈ జంట చూడముచ్చటగా ఉందంటూ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. అలాగే తన పెళ్లిపై రాహుల్ అధికారిక ప్రకటన కోసం కూడా ఆయన ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ఇదిలా ఉంటే... నాటు నాటు పాటతో ఆస్కార్ అవార్డ్ అందుకున్న రాహుల్ సిప్లిగంజ్‌కి స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కోటి రూపాయల చెక్‌ని అందించిన విషయం తెలిసిందే.

## కన్నడ భామ ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్టు

బీర్బల్ మూవీతో కెరీర్ ను స్టార్ట్ చేసిన రుక్మిణి వసంత్, సప్త సాగరాలు దాటి సైడ్ ఎ, సైడ్ బి సినిమాలతో విపరీతమైన క్రేజ్ ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం కన్నడ, తమిళ, తెలుగు భాషల్లో నటిస్తూ భారీ డిమాండ్ ఉన్న టాలెంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా రుక్మిణి ఎదిగారు. విజయ్ సేతుపతి సరసన ఏస్ సినిమాలో నటించి కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన రుక్మిణి రీసెంట్ గానే కాంతార చాప్టర్1 షూటింగ్ లో జాయిన్ అయ్యారు.కాంతార1 తో పాటూ శివ కార్తికేయన్ తో కలిసి రుక్మిణి ఓ సినిమా చేస్తున్నారు. అది కాకుండా మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా రుక్మిణి హీరోయిన్ గా నటించనున్నారు. అయితే ఇప్పుడు మరో భారీ ప్రాజెక్టులో రుక్మిణి చోటు దక్కించుకుందనే విషయం ఆమెను మరోసారి వార్తల్లో నిలిపింది.అదే యష్ హీరోగా వస్తోన్న టాక్సిక్. కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాల తర్వాత యష్ చేస్తున్న సినిమానే టాక్సిక్. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. టాక్సిక్ కోసం ఇప్పటికే పలు భాషల నుంచి స్టార్లను తీసుకోగా ఇప్పుడు కన్నడ ఇండస్ట్రీ నుంచి రుక్మిణి కూడా తోడైనట్టు తెలుస్తోంది. కియారా అద్వానీ, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా లాంటి భారీ తారాగణంతో పాటూ రుక్మిణి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు.టాక్సిక్ లో రుక్మిణి నటిస్తుందనే విషయాన్ని మేకర్స్ ఇంకా అధికారికంగా అనౌన్స్ చేయకపోయినప్పటికీ ఇప్పటికే ఈ సినిమా కోసం రుక్మిణి పలు షెడ్యూళ్ల షూటింగ్ ను కూడా పూర్తి చేశారని శాండిల్‌వుడ్ వర్గాల నుంచి లీకులందుతున్నాయి. ఇంగ్లీష్, కన్నడ భాషల్లో సమాంతరంగా తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమా వచ్చే ఏడాది మార్చి 19న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



## రావు బహదూర్ టీజర్.. 'మహా' అద్భుతం..!

ఏదైనా సినిమా మీద ఆడియన్స్ లో ఇంట్రెస్ట్ ని క్రియేట్ చేసేదే టీజర్. ఫస్ట్ లుక్ టీజర్ తోనే ఆడియన్స్ ని ఎగ్జైట్ అయ్యేలా చేస్తే సినిమా కోసం వాళ్లే ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసేలా వెయిట్ చేస్తారు. ఐతే కమర్షియల్ సినిమాల్లో ఈ లెక్కలు ఎలా ఉన్నా ఒక ఎక్స్ పెరిమెంట్ సినిమాకు మాత్రం టీజరే మ్యాజిక్ చేస్తుంది. అలా ఆడియన్స్ ని ఎంగేజ్ చేసేలా వచ్చిన టీజర్ రావు బహదూర్. వెంకటేష్ మహా డైరెక్షన్ లో సత్యదేవ్ నటిస్తున్న ఈ సినిమా టీజర్ రిలీజైంది. ఈ టీజర్ చూస్తేనే ఎప్పుడెప్పుడు సినిమా చూసేద్దామా అన్నంత ఎగ్జైట్మెంట్ కలిగింది. ఇంతకీ టీజర్ విషయానికి వస్తే ఒక పెద్ద బంగ్లా.. అందులో ఒక వింత మనిషి.. అనుమానం పెనుభూతం అంటూ అతను ఒక కథ చెబుతుంటాడు. ఆ విజువల్స్, ఆ టేకింగ్, ఆ అప్పియరెన్స్ అంతా ఒక కొత్త క్రియేషన్ లా అనిపిస్తుంది. కేరాఫ్ కంచెరపాలెం నుంచి వెంకటేష్ మహా మీద అంచనాలు పెరిగాయి. నెక్స్ట్ ఉమామహేశ్వర ఉగ్రరూపస్య సినిమా కూడా ఇంప్రెస్ చేసింది. ఇప్పుడు ఆ డైరెక్టర్ మహా అద్భుతంగా చేస్తున్న సినిమా రావు బహదూర్. ఈ సినిమాలో సత్యదేవ్ డిఫరెంట్ క్యారెక్టరైజేషన్ కూడా తన వర్సటాలిటీ చూపించేలా ఉంది.వెంకటేష్ మహా ఉగ్రరూపస్య.. రావు బహదూర్ సినిమాను %+వీదీ% ప్రొడక్షన్స్ బ్యానర్ లో సూపర్ స్టార్ మహేష్ బాబు సమర్పిస్తున్నారు. శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్, %ూాయా% మూవీస్ లో చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డ్యి, శరత్ చంద్ర ఈ సినిమా నిర్మిస్తున్నారు. సినిమాలో సత్యదేవ్ కి జతగా దీప థామస్ నటిస్తుంది. మరి టీజర్ తో ఇంప్రెస్ చేసిన ఈ సినిమా వెండితెర మీద ఎలాంటి అద్భుతాలు చేస్తుందో చూడాలి. సత్యదేవ్ తో వెంకటేష్ మహా ఉమామహేశ్వర ఉగ్రరూపస్య సినిమా చేశాడు. ఆ సినిమా తర్వాత మళ్లీ వెంకటేష్ మహా రావు బహదూర్ చేస్తున్నాడు. ఈమధ్యనే కింగ్ డం సినిమాలో శివ రోల్ లో తన నటనతో మెప్పించాడు సత్యదేవ్. మంచి టాలెంట్ ఉన్న ఈ నటుడికి ఒక మంచి సినిమా పడితే బాగుంటుంది అనుకుంటున్న టైం లో రావు బహదూర్ టీజర్ షాక్ ఇచ్చింది.



## అడ్డాల శ్రీకాంత్ తో.. అబ్బవరం కిరణ్..!





టాలీవుడ్ యంగ్ హీరోల్లో కిరణ్ అబ్బవరం నూతన ఉత్సాహంతో సినిమాలు చేస్తున్నాడు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా వచ్చిన కిరణ్ అబ్బవరం తన సత్తా చాటుతున్నాడు. అఫ్కోర్స్ కెరీర్ లో ఎత్తు పల్లాలు కామనే కానీ హీరోగా ఒక ఐడెంటిటీ సంపాదించడంలో సక్సెస్ అయ్యాడు. క ముందు వరకు కిరణ్ పని అయిపోయింది అనుకున్న వారికి క తో షాక్ ఇచ్చాడు. నెక్స్ట్ దిల్ రూబా టార్గెట్ మిస్ అయినా మళ్లీ కె ర్యాంప్ తో హిట్ టార్గెట్ పెట్టుకున్నాడు. కిరణ్ అబ్బవరం కె ర్యాంప్ నుంచి రీసెంట్ గా వచ్చిన టీజర్ కూడా ఇంప్రెస్ చేసింది.

ఇదిలాఉంటే కిరణ్ అబ్బవరం ఒక క్రేజీ కాంబినేషన్ ని సెట్ చేసుకున్నట్టు తెలుస్తుంది. నెక్స్ట్ అతను ఒక పాపులర్ డైరెక్టర్ తో సినిమా చేస్తున్నాడట. అతను ఎవరో కాదు శ్రీకాంత్ అడ్డాల. కొత్త బంగారు లోకం సినిమాతో తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ కొట్టాడు శ్రీకాంత్ అడ్డాల. అతను లాస్ట్ ఇయర్ పెదకాపు అంటూ ఒక అటెంప్ట్ చేశాడు. కానీ ఆ సినిమా పెద్దగా వర్క్ అవుట్ కాలేదు.పెదకాపు సక్సెస్ అయ్యుంటే సీన్ వేరేలా ఉండేది కానీ అది ఫ్లాప్ అవ్వడంతో డైలమాలో పడ్డాడు శ్రీకాంత్ అడ్డాల. ఐతే రీసెంట్ గా అతను కిరణ్ అబ్బవరంకు ఒక స్టోరీ చెప్పాడట. ఆ కథ కిరణ్ కి నచ్చడంతో ప్రాజెక్ట్ కి ఓకే చెప్పారట. ఈ సినిమాలో రానా కూడా ఇన్వాల్వ్ అవుతున్నట్టు తెలుస్తుంది. ఈ సినిమాను రానా కో ప్రొడ్యూస్ చేస్తున్నారని టాక్. సో శ్రీకాంత్ అడ్డాల తో కిరణ్ అబ్బవరం సినిమా సంథింగ్ స్పెషల్ గా ఉండబోతుందని చెప్పొచ్చు.

## ఒకే ఈవెంట్‌లో మెరిసిన విజయ్–రష్మిక..

అమెరికాలోని న్యూయార్క్‌లో నిర్వహించిన వార్షిక 'ఇండియా డే పరేడ్' ఘనంగా జరిగింది. భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జాతీయ ఉత్సవాలుగా జరుపుకునే క్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ప్రతి ఏటా ఈ పరేడ్‌ను నిర్వహిస్తోంది. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత కాన్సులేట్ ఆధ్వర్యంలో అమెరికాలో అతిపెద్ద భారతీయ పరేడ్ అయిన 'ఇండియా డే పరేడ్'ను ఈసారి కూడా అంతే ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు వేలాదిమంది భారతీయ అమెరికన్లు హాజరయ్యారు. ప్రముఖ సినీతారలు రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా హాజరై పరేడ్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కొన్ని రోజులుగా ఈ జంట రిలేషన్‌లో ఉందంటూ పుకార్లు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయ్–రష్మిక తాలూకు న్యూయార్క్ పరేడ్ ఫొటోలు, వీడియోలు ఇప్పుడు మరోసారి నెట్టింట వైరల్ అవుతున్నాయి.ఇక, ఈ జంట 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' వంటి చిత్రాల్లో కలిసి నటించిన విషయం తెలిసిందే. అయితే, త్వరలోనే రష్మిక, విజయ్ హీరోహీరోయిన్లుగా మరో మూవీ తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ దర్శకుడు రాహుల్ సంకృత్యాయన్ దర్శకత్వంలో మరోసారి ఈ జంట అభిమానులకు కనువిందు చేయనుందని సమాచారం. పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుంది.



## హే భగవాన్ గ్లింప్స్.. నవ్వించడానికి

ముందు షార్ట్ ఫిలింస్ లో ఆ తర్వాత సినిమాల్లో సైడ్ రోల్స్ చేస్తూ వచ్చిన సుహాస్ ఈమధ్య లీడ్ రోల్ సినిమాలు చేస్తూ సక్సెస్ ఫుల్ కెరీర్ కొనసాగిస్తున్నాడు. లో బడ్జెట్ సినిమాలే అయినా మంచి కంటెంట్ తో వస్తున్న సుహాస్ సినిమాలు మంచి సక్సెస్ అందుకుంటున్నాయి. అఫ్కోర్స్ ఫ్లాపులు కూడా ఉన్నాయి. కానీ వాటిని సుహాస్ బ్యాలెన్స్ చేస్తున్న తీరు బాగుంది. ఈమధ్యనే ఓ భామ అయ్యో రామ సినిమాతో వచ్చిన సుహాస్ లేటెస్ట్ గా హే భగవాన్ అంటూ వస్తున్నాడు. సుహాస్ అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్.. హే భగవాన్ సినిమా టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమాను త్రిషూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్ లో బి. నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ మూవీని గోపీ అచర డైరెక్ట్ చేస్తున్నారు. సుహాస్ తో అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ లో నటించిన సుహాని నాగరం ఈ సినిమాలో సుహాస్ తో జత కడుతుంది. ఇక గ్లింప్స్ విషయానికి వస్తే సుహాస్ ఫ్యామిలీ ఒక బిజినెస్ చేస్తుంది. ఆ బిజినెస్ ఏంటన్నది చెప్పకుండా హీరోయిన్ ని పడేస్తాడు. తీరా హీరోయిన్ కి ఆ బిజినెస్ గురించి తెలిసి హీరోని అడుగుతుంది. ఇంతకీ ఆ బిజినెస్ ఏంటి.. ఇలాంటి బిజినెస్ కూడా చేస్తారా అని హీరోయిన్ ఎందుకు అడిగింది. బిజినెస్ గురించి అడిగితే సుహాస్ తండ్రి అదే మన వీకే నరేష్ చెప్పను బ్రదర్ అని ఎందుకు అన్నాడు. ఈ వివరాలన్నీ తెలియాలంటే హే భగవాన్ చూడాల్సిందే.

